# మన చౌరాస్తా

తెలుగు దినపత్రిక

సంపుటి : 01 | సంచిక : 226 | ఎడిటర్ : ఉప్పలంచి నరేందర్ | మంగళవారం, 21 జూలై 2026 | పేజీలు : 06 | పేజీలు : 5/-




పార్లమెంట్ సమావేశాలు

## సజావుగా సాగాలి

- దేశం అనేక విజయాలను నమోదు చేస్తోంది
- విక్రమ్ విజయవంతం.. యువకుల నైపుణ్యం
- పార్లమెంట్ ముందు మీడియాతో ప్రధాని మోడీ

2

## ముస్తాబైన బల్కంపేట

- నేడు,రేపు ఎల్లమ్మ కల్యాణోత్సవం
- వివిధ ప్రాంతాల నుంచి భారీగా తరలిరానున్న భక్తులు
- ట్రాఫిక్ డైవర్షన్ ప్రకటించిన పోలీసులు



**హైదరాబాద్, జూలై 20 (మన చౌరాస్తా) :** తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా ఆషాడం బోనాల ఉత్సవాలు జరుగుతున్నాయి. హైదరాబాద్‌లోని బల్కంపేట ఎల్లమ్మ కళ్యాణోత్సవం, రథోత్సవం.. మంగళవారం, బుధవారం నిర్వహించనున్నారు. ఈ ఉత్సవాలకు తెలుగు రాష్ట్రాలతోపాటు వివిధ రాష్ట్రాల నుంచి భక్తులు భారీగా పోటెత్తనున్నారు. ఈ నేపథ్యంలో బల్కంపేట పరిసర ప్రాంతాలు భక్తులతో కిక్కిరిసి పోనుంది. దాంతో ఆ ప్రాంతంలో ట్రాఫిక్‌ను మరో మార్గంలో మళ్లిస్తామని హైదరాబాద్ ట్రాఫిక్ పోలీస్ జాయింట్ కమిషనర్ వెల్లడించారు. గ్రీన్‌ల్యాండ్స్, సత్యం థియేటర్ నుంచి బల్కంపేట, ఫతేనగర్ వైపు వెళ్లే వాహనాలు ఎసఆర్ నగర్ టి జంక్షన్, బీకే గూడ మీదుగా సనత్‌నగర్ వెళ్లాల్సి ఉంటుందని వివరించారు. ఫతేనగర్ ఫ్లై ఓవర్ నుంచి బల్కంపేట వైపు వాహనాలకు అనుమతి లేదని స్పష్టం చేశారు. కట్టమైసమ్మ గుడి, బేగంపేట వైపు మళ్లిస్తామని పేర్కొన్నారు. గ్రీన్‌ల్యాండ్స్ ` ఫుడ్ వరల్డ్ నుంచి బల్కంపేట వైపు వాహనాలకు నో ఎంట్రీ అని చెప్పారు. బేగంపేట, కట్టమైసమ్మ ఆలయం నుంచి బల్కంపేట వైపు వచ్చే ట్రాఫిక్‌ను సత్యం థియేటర్, మైత్రీవనం వైపు మళ్లిస్తామని అన్నారు. ఎసఆర్ నగర్ టి జంక్షన్ నుంచి ఫతేనగర్ వరకు ఉన్న చిన్న సందులు అన్నీ మూసివేస్తామని తెలిపారు. అమ్మవారి దర్శనం కోసం వచ్చే భక్తుల వాహనాల పార్కింగ్ కోసం ఆర్ అండ్ బీ కార్యాలయం, జిహెచఎంసి గ్రౌండ్, నేచర్ క్యూర్ హాస్పిటల్ వద్ద సౌకర్యం కల్పించామని వివరించారు. ఈ ప్రాంతం వైపు వచ్చే వారు ప్రత్యామ్నాయ మార్గాలు చూసుకోవాలని వాహనదారులకు హైదరాబాద్ ట్రాఫిక్ పోలీస్ జాయింట్ కమిషనర్ విజ్ఞప్తి చేశారు.






**న్యూఢిల్లీ, జూలై20 (మన చౌరాస్తా) :** దేశ రాజధానిలోని జంతర్ మంతర్ వద్ద ఉద్రిక్త వాతావరణం నెలకొంది. నీట్ యూజీ పరీక్షల అక్రమాలు, కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా డిమాండ్‌తో కాక్రోచ్ జనతా పార్టీ ఆధ్వర్యంలో జంతర్ మంతర్ వద్ద చేపట్టిన 'చలో పార్లమెంట' కార్యక్రమం తీవ్ర ఉద్రిక్తతకు దారితీసింది. సీజేపీ మద్దతు దారులు బారికేడ్లను తోసుకొని పార్లమెంట్‌లోకి దూసుకెళ్లేందుకు ప్రయత్నిం చారు. వారిని అడ్డుకునేందుకు పోలీసులు టియర్ గ్యాస్ ప్రయోగించి ఆందోళనకారులను చెదరగొట్టారు. సోమవారం పార్లమెంట్ మార్చ్ సందర్భంగా కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) కార్యకర్తలు, మద్దతుదారులు జంతర్ మంతర్ వద్దకు భారీగా చేరుకున్నారు. దేశవ్యాప్తంగా వివిధ రాష్ట్రాల నుంచి వేలాది మంది విద్యార్థులు కూడా హాజరయ్యారు. దీంతో ఆ ప్రాంతంలో భద్రతా దళాలు పెద్దఎత్తున మోహరించాయి. దీంతో ఢిల్లీలోని పార్లమెంట్ వద్ద హైటెన్షన్ వాతావరణం నెలకొంది. రైసినా రోడ్డు మార్గంలో ఈ ఘటన జరిగింది. పార్లమెంట్‌కు సుమారు 200 మీటర్ల దూరంలో ఆందోళనకారుల్ని పోలీసులు అడ్డుకున్నారు. జంతర్ మంతర్ నుంచి సీజేపీ.. పార్లమెంట్ మార్చ్ చేపట్టిన విషయం తెలిసిందే. ప్రెస్ క్లబ్ ఆఫ్ ఇండియా వద్ద ఆందోళనకారులపై టియర్ గ్యాస్ ప్రయోగించారు. సీజేపీ కార్యకర్తలను చెదరగొట్టే ఉద్దేశంతో టియర్ గ్యాస్‌ను ప్రయోగించారు. సన్‌సద్ మార్గ్ రోడ్డులో వస్తున్న ఆందోళనకారుల్ని కూడా పోలీసులు అడ్డుకున్నారు.

..:: మిగతా 2లో

# ఢిల్లీలో హైటెన్షన్!

## ఉద్రిక్తంగా చలో పార్లమెంట్ పిలుపు

- సీజేపీ కార్యకర్తల రాకతో పార్లమెంట్ వద్ద ఉద్రిక్తత
- పోలీస్ బారికేడ్లను దాటుకుని వచ్చిన వేలది మంది
- ర్యాలీని అడ్డుకునేందుకు పోలీసుల లాఠీచార్జ్, టియర్ గ్యాస్ ప్రయోగం






పామాయిల్ పెంపకం రైతులకు

## లాభదాయకం

- వర్షా భావంలోనూ పంటలకు ఢోకా లేదు
- పామాయిల్ ధరల పెంపునకు కృషి చేస్తున్నాం..
- అంజనాపురంలో గోద్రెజ్ పామ్ ఫ్యాక్టరీ ప్రారంభం
- మంత్రి తుమ్మలతో కలసి ప్రారంభించిన డిప్యూటీ సీఎం భట్టి

4

క్యూర్ పరిధిలో

## ఇందిరమ్మ ఇళ్లు

- ప్లాట్ల కోసం పది వరకు దరఖాస్తుల స్వీకరణ
- రూ.10 వేలు చెల్లించి దరఖాస్తు చేసుకోవాలి
- ఇందిరమ్మ ఇళ్ల బ్రోచర్ ఆవిష్కరించిన మంత్రులు

**హైదరాబాద్, జూలై 20 (మన చౌరాస్తా) :** క్యూర్ పరిధిలో ప్లాట్ల కోసం ఆగస్టు 10వ తేదీ వరకు దరఖాస్తులు స్వీకరిస్తున్నామని తెలంగాణ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. మీ సేవ, వాట్సాప్, వెబ్‌సైట్‌లో వీటికోసం దరఖాస్తు చేసుకోవచ్చని సూచించారు. రూ.10వేల టోకెన్ చెల్లించి దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. డ్రా పద్ధతిలో లబ్దిదారుల ఎంపిక ఉంటుందని స్పష్టం చేశారు. డ్రాలో ఇల్లు రానివారి డబ్బులు వెంటనే చెల్లిస్తామని వెల్లడించారు. ఆయా ప్లాట్లు పదేళ్ల పాటు అమ్మరాదని.. అద్దెకు ఇవ్వరాదని షరతును విధిస్తామని అన్నారు. కుటుంబంలో ఒకరికి ఇళ్లకు దరఖాస్తు చేసుకునే అవకాశం ఉంటుందని తెలిపారు.

..:: మిగతా 2లో



# పార్లమెంట్ సమావేశాలు సజావుగా సాగాలి

- దేశం అనేక విజయాలను నమోదు చేస్తోంది
- విక్రమ్ విజయవంతం.. యువకుల నైపుణ్యం
- పార్లమెంట్ ముందు మీడియాతో ప్రధాని మోడీ




**న్యూఢిల్లీ, జూలై 20 (మన చౌరాస్తా) :** పార్లమెంట్ సమావేశాలు సజావుగా సాగేలా చూడాలని ప్రధానమంత్రి నరేంద్రమోదీ వ్యాఖ్యానించారు. ఈ సమావేశాలు నిర్మాణాత్మకంగా జరుగుతాయని ఆశిస్తున్నానని పేర్కొన్నారు. పార్లమెంట్ సమావేశాల సందర్భంగా మోడీ మీడియాతో మాట్లాడారు. గత నెల రోజులుగా దేశంలో అనేక పరిణామాలు జరిగాయని వెల్లడించారు. అంతరిక్ష ప్రస్థానంలో నవశకం ప్రారంభమైందని తెలిపారు. స్టార్టప్ కంపెనీ తయారు చేసిన విక్రమ్`1 రాకెట్ విజయవంతంగా నింగిలోకి దూసుకెళ్లిందని వివరించారు. సోమవారం పార్లమెంట్ దగ్గర మీడియాతో ప్రధాని మాట్లాడారు. భారత అంతరిక్ష ప్రస్థానంలో కీలక ఘట్టం ఆవిష్కృతమైందని ఉద్ఘాటించారు. భారతదేశ యువత అంతరిక్షంలోకి దూసుకుపోయిందని ప్రధాని మోదీ వ్యాఖ్యానించారు. విక్రమ్`1 విజయం వెనుక యువత పాత్ర కీలకమని తెలిపారు. స్కైరూట్ విజయవంతం అవడం దేశానికి గర్వకారణమని పేర్కొన్నారు. అదే సమయంలో అంతరిక్ష రంగ స్టార్టప్ స్కైరూట్ 'విక్రమ్`1' ప్రయోగం విజయవంతం అవడంపై ప్రధాని హర్షం వ్యక్తం చేశారు. 28 ఏళ్ల సగటు వయసున్న ఆవిష్కర్తలదే ఈ ఘనత అని కొనియాడారు. 'ఏడాది కాలంలో ఎన్నో గొప్ప విషయాలు జరిగాయి. అంతరిక్షంతో సహా వేదిక ఏదైనా.. మనం సాధించిన విజయాలు దేశానికి గర్వకారణం. గత సంవత్సరం వర్షాకాల సమావేశాలకు ముందు ఒక భారతీయ పౌరుడు శుభాంశు శుక్లా అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రానికి చేరుకున్నారు. ఇప్పుడు ఒక భారతీయ స్టార్టప్ స్కైరూట్ అద్భుతమైన ఘనత సాధించిందని మోదీ వ్యాఖ్యానించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీకి పరోక్షంగా చురకలంటించారు. భారత యువత అంతరిక్షంలో ఒక కొత్త ప్రయాణాన్ని ప్రారంభించారు. ప్రపంచంలోని కొన్ని దేశాల్లో మాత్రమే ఇలాంటి ప్రైవేటు సంస్థలు ఉన్నాయి. స్కైరూట్ స్టార్టప్ బృందం సగటు వయసు 28 ఏళ్లని నాకు తెలిసింది. ఇక్కడ నేను 56 ఏళ్ల యువకుడి గురించి మాట్లాడటం లేదని పరోక్షంగా రాహుల్‌ను ఉద్దేశించి మోదీ అన్నారు. యువత సాధించిన ఈ విజయం యాదృచ్ఛికం కాదు. మన దేశ యువత సామర్థ్యం, ఆకాంక్షలు అంతరిక్షం వలే హద్దుల్లేనివని చెప్పే సందేశం ఇదని ప్రధాని ప్రశంసించారు. రాజస్థాన్‌లో అతిపెద్ద ఆయిల్ రిఫైనరీని దేశానికి అంకితం చేశామని వెల్లడించారు. ఒక సెమీ కండక్టర్ ప్లాంట్, గ్రీన్ హైడ్రోజన్ రైలును ప్రారంభించామని తెలిపారు. యుద్ధంతో చాలా దేశాలకు నష్టం జరుగుతోందని చెప్పారు. చమురు ధరలు అమాంతం పెరుగుతున్నాయని తెలిపారు. 7.7శాతం గ్రోత్‌రేట్ భారత్ నమోదు చేస్తోందని ప్రధాని మోదీ పేర్కొన్నారు. పార్లమెంటు వర్షాకాల సమావేశాల ప్రారంభానికి ముందు ప్రధాని నరేంద్రమోదీ దేశ ప్రజలను ఉద్దేశించి మాట్లాడారు. 'వర్షాకాలం, వర్షాకాల సమావేశాలు.. ఈ రెండు చురుగ్గా ఉంటే ఫలితాలు గొప్పగా ఉంటాయి. అప్పుడే దేశం సంక్షేమంగా ఉంటుంది. అందుకే ఈ రెండూ మెరుగ్గా ఉండాలని కోరుకుంటున్నాను' అని మోదీ తెలిపారు. గందరగోళ పరిస్థితులకు తావులేకుండా పార్లమెంట్ ఉభయ సభల్లో చర్చలు జరగాలని ఆకాంక్షించారు.



# ఢిల్లీలో హైటెన్షన్

(మొదటి పేజీ తరువాయి)



సన్‌సద్ మార్గ్ పోలీసు స్టేషన్ వద్ద బారికేడ్లు పెట్టి నిరసనకారుల్ని ముందుకు కదలకుండా చేశారు. అయినా తోసుకుని రావడంతో భద్రతా బలగాలు లాఠీఛార్జ్ చేశాయి. ఆ ఘర్షణలో కొందరు ఆందోళనకారులు గాయపడ్డారు. సైట్ వద్దే వారికి ప్రథమ చికిత్స అందించారు. వికాస్ మార్గ్‌లోని ఐటీవో వద్ద కూడా నిరసనకారులను బ్లాక్ చేశారు. ఐటీవో, సెంట్రల్ ఢిల్లీ రూట్లో ఇది కీలకమైన ప్రదేశం. పార్లమెంట్, జంతర్ మంతర్ ఈ మార్గంలోనే ఉన్నాయి. పార్లమెంట్ స్ట్రీట్ వద్ద వేల సంఖ్యలో సీజేపీ కార్యకర్తలు చేరుకున్నారు. వారిపై లాఠీఛార్జ్ జరిగినట్లు తెలుస్తోంది. బారికేడ్లను తొలగించేందుకు నిరసనకారులు ప్రయత్నించారు. పోలీసులకు, సీజేపీ కార్యకర్తలకు గాయాలయ్యాయి. సుమారు 15 మంది ఆందోళనకారులను అదుపులోకి తీసుకున్నారు. ర్యాలీ ప్రారంభమైన వెంటనే నిరసనకారులను భద్రతా బలగాలు అడ్డుకున్నాయి. ఈ సందర్భంగా భద్రతా సిబ్బంది, సీజేపీ కార్యకర్తల మధ్య తీవ్ర వాగ్వాదం చోటు చేసుకుంది. దీంతో వారిని చెదరగొట్టేందుకు భద్రతా దళాలు లాఠీఛార్జ్ చేశాయి. పలువురిని అరెస్టు చేశారు. మరోవైపు, ఇప్పటికే పార్లమెంట్‌కు వెళ్లే అన్ని మార్గాలను అధికారులు మూసివేశారు. జంతర్ మంతర్‌తో పాటు పటేల్ చౌక్, పార్లమెంట్ స్ట్రీట్, రైల్ భవన్ ప్రాంతాలను తమ ఆధీనంలోకి తీసుకున్నారు. ముందస్తు చర్యల్లో భాగంగా ఐదు మెట్రో స్టేషన్లను కూడా మూసి వేశారు. అలాగే సెంట్రల్ ఢిల్లీలోని కొన్ని ప్రాంతాల్లో మొబైల్ ఇంటర్నెట్‌ను నిలిపివేశారు. పార్లమెంట్ సమావేశాల ప్రారంభం రోజున తలపెట్టిన ఈ మార్చ్‌కు పోలీసులు అనుమతి నిరాకరించారు. ఎక్కడికక్కడ విద్యార్థులను అడ్డుకొనేందుకు పకడ్బందీ ఏర్పాట్లు చేసినప్పటికీ.. భారీ సంఖ్యలో నిరసనకారులు బారికేడ్లను దాటుకొని పార్లమెంట్ వైపు ర్యాలీగా వెళ్లేందుకు ప్రయత్నించారు. దాంతో వారిని చెదరగొట్టేందుకు పోలీసులు లాఠీఛార్జి చేశారు. భాష్పవాయువు గోళాలను ప్రయోగించారు. కొందరిని అదుపులోకి తీసుకున్నారు. దీంతో ఆ ప్రాంతమంతా తీవ్ర ఉద్రిక్త వాతావరణం నెలకొంది. ఈ క్రమంలో పలువురు పోలీసులకు గాయాలైనట్లు సమాచారం.

# అమిత్ షాతో ధర్మేంద్ర ప్రధాన్ భేటీ

- సీజేపీని చర్చలకు పిలిచిన జేపీ నడ్డా



**న్యూఢిల్లీ, జూలై20 (మన చౌరాస్తా) :** సీజేపీ కార్యకర్తల చలో పార్లమెంట్ పిలుపుతో ఢిల్లీలో ఉద్రిక్తత నెలకొంది. మరోవైపు, కేంద్ర హోంమంత్రి అమిత్ షాతో విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ భేటీ కావడం ప్రాధాన్యం సంతరించుకుంది. పార్లమెంట్ భవనం లోపల వీరి భేటీ జరిగినట్లు జాతీయ మీడియాలో వార్తలు వస్తున్నాయి.'చలో పార్లమెంట్' వేళ ఈ నిరసనలనకు నాయకత్వం వహిస్తున్న నాయకులతో కేంద్రమంత్రి జేపీ నడ్డా భేటీ అయ్యారు. అలాగే ధర్మేంద్ర ప్రధాన్ కూడా వారితో మాట్లాడుతున్నారు. మరోవైపు, ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న పర్యావరణ ఉద్యమకారుడు సోనమ్ వాంగ్‌చుక్‌ను జేపీ నడ్డా కలవనున్నారని సమాచారం. పరీక్షల నిర్వహణలో అవకతవకలు చోటుచేసుకున్నాయని ఆరోపిస్తూ ఆందోళనలు కొనసాగుతున్న నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం చర్చలకు ముందుకొచ్చిందని కాక్రోచ్ జనతా పార్టీ(సీజేపీ) సోమవారం ప్రకటించింది. తమ డిమాండ్లను వివరించేందుకు ఇద్దరు అధికార ప్రతినిధులు కేంద్ర మంత్రి జేపీ నడ్డాతో భేటీ కానున్నట్లు సీజేపీ వెల్లడించింది. అయితే.. ఈ చర్చల అంశంపై కేంద్ర ప్రభుత్వం నుంచి ఇప్పటివరకు అధికారికంగా ఎలాంటి ప్రకటనా వెలువడలేదు. ఇదిలా ఉండగా.. పరీక్షల అవకతవకలపై బాధ్యులపై చర్యలు తీసుకోవాలని, అలాగే కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ వేలాది మంది సీజేపీ కార్యకర్తలు, నిరసనకారులు ఢిల్లీలోని పార్లమెంట్ స్ట్రీట్ వద్దకు చేరుకున్నారు. అక్కడి నుంచి పార్లమెంట్ వైపునకు ర్యాలీగా వెళ్లేందుకు యత్నించగా భద్రతా బలగాలు అడ్డుకున్నాయి. ఈ సందర్భంగా నిరసనకారులను చెదరగొట్టేందుకు పోలీసులు లాఠీచార్జ్ చేశారు. ఈ నేపథ్యంలో పోలీస్ బలగాలు, సీజేపీ కార్యకర్తల మధ్య తోపులాట చోటుచేసుకోగా.. పలువురు పోలీసులు, సీజేపీ కార్యకర్తలకు గాయాలయ్యాయి. దీంతో టియర్ గ్యాస్ ప్రయోగించి ఆందోళనకారులను చెదరగొట్టారు పోలీసులు. ఈ క్రమంలో పార్లమెంట్ పరిసర ప్రాంతంలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ఈ పరిణామాల మధ్య సీజేపీ ప్రతినిధులు.. జేపీ నడ్డాతో భేటీ కానుండటం ప్రాధాన్యం సంతరించుకుంది. చర్చల అనంతరం పరిస్థితిపై స్పష్టత వచ్చే అవకాశమున్నట్టు తెలుస్తోంది.

# అభిజిత్ దీప్కే అరెస్ట్ వార్తలు

## పుకార్లను నమ్మవద్దని ఢిల్లీ పోలీసుల వెల్లడి

**న్యూఢిల్లీ, జూలై 20 (మన చౌరాస్తా) :** కాక్రోజ్ జనతా పార్టీ (సీజేపీ) అధ్యక్షుడు అభిజిత్ దీప్కేను అరెస్ట్ చేశారంటూ వస్తున్న వార్తలను ఢిల్లీ పోలీసులు ఖండించారు. సోషల్ మీడియాలో ఫేక్ న్యూస్, అసత్య ప్రచారాలను నమ్మ వద్దని ప్రజలకు వారు స్పష్టం చేశారు. అభిజిత్ దీప్కే .. జంతర్ మంతర్ ధర్నా పాయింట్ వద్ద ఉన్నారని ఢిల్లీ పోలీసులు వివరించారు. అభిజిత్‌ను పోలీసులు అదుపులోకి తీసుకోవడం కానీ.. అరెస్ట్ చేయడం కానీ జరగలేదని కాక్రోచ్ జనతా పార్టీ ప్రకటించింది. నీట్ పేపర్ లీక్, విద్యావ్యవస్థలోని లోపాల నేపథ్యంలో కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్.. పదవికి రాజీనామా చేయాలని కాక్రోచ్ జనతా పార్టీ డిమాండ్ చేస్తుంది. ఈ నేపథ్యంలో సోమవారం చలో పార్లమెంట్‌కు ఆ పార్టీ పిలుపునిచ్చింది. ఈ యాత్రకు ఢిల్లీ పోలీసులు అనుమతి ఇవ్వలేదు. ఈ యాత్రలో భారీగా యువత పాల్గొంది. ఈ యాత్రను అడ్డుకునేందుకు పోలీసులు ఎక్కడికక్కడ భారీగా ఏర్పాట్లు చేశారు. అయినా నిరసనకారులు భారీ సంఖ్యలో పార్లమెంట్ వైపునకు దూసుకెళ్లారు. వారిని నిలువరించేందుకు పోలీసులు లాఠీ ఛార్జ్ చేశారు. భాష్పవాయుగోళాలు ప్రయోగించారు. దీంతో నిరసనకార్లు.. పోలీసులపైకి రాళ్లు రువ్వారు. పలువురు పోలీసులకు గాయాలయ్యాయి. దీంతో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. ఇంకోవైపు ఈ యాత్రలో పాల్గొన్న సోనమ్ వాంగ్ చుక్ భార్య గీతాంజలి జుట్టు పట్టుకుని ఢిల్లీ పోలీసులు లాగారు. దీంతో గీతాంజలిపై పోలీసులు దాడి చేశారంటూ సీజేపీ ఆరోపించింది. ఈ ర్యాలీలో పాల్గొన్న 12 ఏళ్ల బాలికపై పోలీసులు దాడి చేశారని.. దీంతో ఆమె తల పగిలిందని వివరించింది. మరో 40 నుంచి 50 మంది సీజేపీ కార్యకర్తల తలలు పగిలిపోయాయని కాక్రోచ్ జనతా పార్టీ ప్రకటించింది. సోమవారం నుంచి పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు ప్రారంభమయ్యాయి. దీంతో పార్లమెంట్ ముఖ్య ప్రాంతాల్లో పోలీసులు భారీగా మోహరించారు.

**దీక్ష విరమించినట్లు దీప్కే ప్రకటన**

కాక్రోచ్ జనతా పార్టీ వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే తన ఆమరణ దీక్షను విరమించారు. సామాజిక కార్యకర్త సోనమ్ వాంగ్‌చుక్ అభ్యర్థన మేరకు దీప్కే తన దీక్షను విరమించినట్లు తెలుస్తోంది. పార్లమెంట్ మార్చ్ చేస్తున్న వారికి సంఘీభావంగా దీక్షను విరమించాలని వాంగ్‌చుక్ కోరారు. డెహ్రాడూన్‌కు చెందిన నీట్ అభ్యర్థి రాయ్ మృతి చెందిన విషయం తెలిసిందే. ఆమె తండ్రితో కలిసి దీప్కే దీక్షను విరమించారు. ప్రస్తుతం సఫ్దార్‌జంగ్ ఆస్పత్రిలో వాంగ్‌చుక్ చికిత్స పొందుతున్నారు. జంతర్ మంతర్ వద్ద ఆయన దీక్షను పోలీసులు భగ్నం చేసి ఆస్పత్రికి తీసుకెళ్లిన విషయం తెలిసిందే. వాంగ్‌చుక్‌ను తరలించిన తర్వాత .. అభిజీత్ దీప్కే ఆమరణ దీక్షకు పూనుకున్నారు. మరో వైపు పార్లమెంట్‌లో విద్యార్థుల ఆందోళనపై రచ్చ కొనసాగుతోంది. ఇవాళ ప్రారంభమైన ఉభయసభల్లోనూ విపక్షాలు ఆందోళన చేస్తున్నాయి. నీట్ పేపర్ లీకేజీ అంశంపై చర్చ చేయాలని డిమాండ్ చేశాయి. దీంతో ఇప్పటికే పలుమార్లు లోక్‌సభ, రాజ్యసభలు వాయిదా పడ్డాయి. విద్యార్థుల గొంతును ప్రభుత్వం నొక్కేస్తోందని రాజ్యసభలో ఖర్గే ఆరోపించారు. పార్లమెంట్ మార్చ్‌లో పాల్గొనేందుకు తనకు అవకాశం ఇవ్వాలని వాంగ్‌చుక్ కోరారు. ఆస్పత్రి నుంచి తాత్కాలికంగా డిశ్చార్జ్ చేయాలని కోరినట్లు తెలిసింది.






# క్యూర్ పరిధిలో ఇందిరమ్మ ఇళ్లు

(మొదటి పేజీ తరువాయి)

క్యూర్ పరిధిలో ఇల్లు, స్థలం లేనివారికి తొలివిడతలో ప్రాధాన్యం కల్పిస్తామని మంత్రి చెప్పుకొచ్చారు. లబ్దిదారుల పేరిట స్థలం రిజిస్ట్రేషన్ చేస్తామని తెలిపారు. స్థలంతో పాటు రూ.5లక్షల సబ్సిడీ అందజేస్తామని పేర్కొన్నారు. సోమవారం ఇందిరమ్మ ఇళ్లకు సంబంధించిన వాట్సాప్ దరఖాస్తులు, ఇళ్ల బ్రోచర్‌లను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, శ్రీధర్ బాబు, పొన్నం ప్రభాకర్, అజారుద్దీన్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి మాట్లాడారు. వారికి స్థలం ఇవ్వడంతో పాటు రూ.5లక్షల సహాయం అందజేస్తామని మంత్రి పొంగులేటి వెల్లడించారు. పదేళ్ల వరకు ఇళ్లు అమ్ముకునే అవకాశం లేదని చెప్పుకొచ్చారు. మొదటి దశలో 16నియోజకవర్గాల్లో ఇస్తున్నామని.. త్వరలోనే మిగిలిన నియోజకవర్గాల్లో కూడా ఇళ్లు ఇస్తామని స్పష్టం చేశారు. ఆయా పార్టీలు, రాజకీయాలకు సంబంధం లేకుండా ఇళ్లను కేటాయిస్తామనిపేర్కొన్నారు. రాష్ట్రంలో రెండు లక్షల ఇందిరమ్మ ఇళ్లు పూర్తి అవుతున్నాయని ఇప్పటికే రెండు విడతల్లో ఏడు లక్షల ఇళ్లు మంజూరు చేశామని పేర్కొన్నారు. ఇప్పటి వరకు సొంత స్థలాలు ఉన్న వారికి ఇందిరమ్మ ఇళ్లు అందజేశామని వెల్లడించారు. ఇంటి స్థలంలేని పేదలకు కూడా వీటిని అందజేయాలని తమ ప్రభుత్వం నిర్ణయించిందని మంత్రి పొంగులేటి వివరించారు. లాభం, స్వార్థం లేకుండా పేదలకు ఇళ్లు నిర్మించి అందజేస్తున్నామని పేర్కొన్నారు. అజఖీఇ పరిధిలో ఇళ్లు కట్టించే పథకాన్ని ఈ రోజు ప్రారంభించామని తెలిపారు. ఇందుకోసం పదహారు నియోజకవర్గాల్లో స్థలాలు ఎంపిక చేశామని చెప్పుకొచ్చారు. 528 అడుగుల చదరపు మీటర్ల విస్తీర్ణంలో ప్లాట్లను నిర్మిస్తున్నామని వెల్లడించారు. కేసీఆర్ హయాంలో తప్పిదాలతో అప్పుడు కట్టిన ప్లాట్లు ఉపయోగపడకుండా పోయాయని చెప్పారు. నగరానికి దూరంగా 35 కిలోమీటర్ల దూరంలో కట్టడంతో పేదలు అక్కడకు వెళ్లలేదని తెలిపారు. చదరపు గజానికి లక్షల విలువ ఉండే కోర్ ప్రాంతంలో టవర్లు నిర్మించి పేదలకు ఇస్తామని మంత్రి పొంగులేటి స్పష్టం చేశారు. పేదలకు ఇళ్లు ఇస్తామంటే కొందరు హేళన చేశారని అన్నారు. ఈ పథకం ఫెయిల్ అయితే విమర్శించాలని కొందరు సంతోషపడ్డారని చెప్పుకొచ్చారు. రాష్ట్రానికి ఆర్థిక ఇబ్బందులు ఉన్నా పేదలకు ఇంటి కల నెరవేర్చాలని తమ ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తుందని తెలిపారు. బీజేపీ అధికారంలో ఉన్న రాష్ట్రాల్లో కూడా ఇలా ఇళ్లు కట్టించి ఇవ్వడం లేదని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. గుడిసెలు లేని తెలంగాణ రాష్ట్రం తమ ప్రభుత్వం లక్ష్యమని మంత్రి శ్రీధర్ బాబు వ్యాఖ్యానించారు. ఆ లక్ష్యంతోనే ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం కోసం శ్రీకారం చుట్టామని పేర్కొన్నారు. నాలుగు దశాబ్దాల క్రితమే కాంగ్రెస్ ప్రభుత్వం ఒఎఉ ఇళ్లను నిర్మించిందని తెలిపారు. నగరంలో చాలాచోట్ల హౌసింగ్ బోర్డు కాలనీలు ఉన్నాయని ప్రస్తావించారు. ఎంత విలువైన భూమి అయినా పేదలకు ఇవ్వాలని తాము నిర్ణయించామని చెప్పుకొచ్చారు. పారదర్శకంగా ఇళ్ల కేటాయింపు జరుగుతోందని స్పష్టం చేశారు. ఇళ్ల కేటాయింపుల్లో రిజర్వేషన్లు అమలు చేస్తామని తెలిపారు. మొదటి విడతలో 16నియోజకవర్గాల్లో 7680 ప్లాట్లను నిర్మిస్తామని మంత్రి శ్రీధర్ బాబు పేర్కొన్నారు. క్యూర్ పరిధిలోని ప్రజలకు మంత్రి పొన్నం ప్రభాకర్ శుభాకాంక్షలు తెలిపారు. హైదరాబాద్‌లో స్థలం లేని పేదలు కిరాయి ఇళ్లలో ఉంటున్నారని తెలిపారు. అజఖీఇలో పేదలకు తమ ప్రభుత్వమే స్థలం ఇచ్చి ఇందిరమ్మ ఇళ్లను నిర్మించుకునే పథకాన్ని ప్రారంభించామని వెల్లడించారు. గత ప్రభుత్వం హౌసింగ్ విభాగాన్నే రద్దు చేసిందని చెప్పుకొచ్చారు. తాము దాన్ని పునరుద్ధరించామని అన్నారు. బల్కంపేట ఎల్లమ్మ బోనాల ముందు అజఖీఇలో ఈ పథకం ప్రారంభించామని వెల్లడించారు. మళ్లీ వచ్చే బోనాల నాటికి ఇళ్ల నిర్మాణం పూర్తి చేయాలని టార్గెట్‌గా పెట్టుకున్నామని మంత్రి పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు.

# అప్పుడు నిండు కుండలా..
# ఇప్పుడు నిలకడ లేకుండా..

గతంలో మన పూర్వీకులు తక్కువ సంపాదించినా ఎక్కువ ఆనందంగా ఉండేవారు. అద్భుతమైన ఆర్థిక క్రమశిక్షణతో బతికారు. మరి ఈనాటి తరం? సంపాదనలో రికార్డులు సృష్టిస్తోంది కానీ, మనశ్శాంతిలో మాత్రం అట్టడుగున ఉంటోంది. ఎప్పుడూ ఏదో తెలియని ఆందోళన, ఒత్తిడి, రేపటి గురించిన భయం. అసలు మన పూర్వీకుల దగ్గర ఉన్న ఆ మ్యాజిక్ ఏంటి? మనం ఎక్కడ తప్పు చేస్తున్నాం? 'ఆర్థిక అభిమన్యులు' సిరీస్‌లో ఈరోజు ఆ గుట్టు విప్పుదాం.




### తాతల నాటి 'నిండు కుండ' ఆర్థిక సూత్రం

ఒకప్పుడు పల్లెటూళ్లలో లేదా చిన్న పట్టణాల్లో జీవనం ఎలా ఉండేదో ఒక్కసారి గుర్తుచేసుకోండి. తాతకో, తండ్రికో వచ్చే జీతం వందల్లోనో, వేలల్లోనో ఉండేది. కానీ ఆ తక్కువ సంపాదనతోనే నలుగురు పిల్లలను చదివించేవారు, పెళ్లిళ్లు చేసేవారు, చిన్నదో పెద్దదో ఒక సొంత ఇల్లు కట్టుకునేవారు. అన్నింటికీ మించి, రాత్రి పూట హాయిగా నిద్రపోయేవారు. ఎందుకంటే.. వారి ఆర్థిక క్రమశిక్షణకు కొన్ని ముఖ్యమైన మూలస్థంభాలు ఉండేవి :

### ఆదాయానికి మించిన ఖర్చు లేదు

ఉన్నంతలో తృప్తి పడేవారు. అది జీవితంలో మనశ్శాంతిని, ఆర్థిక స్థిరత్వాన్ని ఇచ్చేది. అనవసరమైన ఖర్చులు, అప్పుల ఊబి అనేవి ఉండేవి కాదు. అలాగే, మానసిక ప్రశాంతత లభించేది. ఇతరులతో పోల్చుకునేవాళ్లు కాదు. ఫలితంగా ఒత్తిడి ఉండేది కాదు.

### అప్పు అంటే ఒక భయం

ఆ రోజుల్లో అప్పు చేయాలంటే సమాజంలో పరువు పోతుందనే భయం ఉండేది. అత్యవసరమైతే తప్ప ఎవరూ అప్పు జోలికి వెళ్లేవారు కాదు.

### ఆడంబరాలకు తావు లేదు

డాంబికాలకు అంటే ఆడంబరాలకు పోకుండా జీవించడం నేర్చుకున్నారు. పక్కింటివాడు టీవీ కొన్నాడని, వీరు అప్పు చేసి మరీ రంగుల టీవీ తెచ్చుకునే సంస్కృతి అప్పట్లో లేదు. ఉన్నదానితో తృప్తి పడటం వారికి వెన్నతో పెట్టిన విద్య.

### పొదుపు ప్రథమ కర్తవ్యం

జీతం రాగానే ముందు కొంత డబ్బును పక్కన పెట్టేవారు. పోస్టాఫీసు సేవింగ్స్, బ్యాంకు ఎఫ్‌డీలు, లేదా ఇంట్లో పెట్టెలోనే దాచుకునేవారు. మిగిలిన దాంతోనే నెలంతా గడిపేవారు. ఈ స్పష్టమైన ప్రణాళిక వల్ల మన వెనుకటి తరంలో వాళ్ల మనసు ఎప్పుడూ ప్రశాంతంగా ఉండేది.

"డబ్బులు లేకపోయినా అప్పట్లో ఎంత ప్రశాంతంగా బతికామో తెలుసా?" ఈ మాట మన ఇంట్లో పెద్దవాళ్ళ నోట ఎప్పుడో ఒకప్పుడు వింటూనే ఉంటాం. అప్పుడు మన మనసులో ఒక చిన్న అపరాధ భావం కదలాడుతుంది. అంతేకాదు.. వాళ్ల వాదనలను తీసిపారేయడానికి మన అమ్ములపొదిలోంచి ఆలోచనాస్త్రం బయటకు తీస్తాం. "అప్పటి రోజులు వేరు తాతయ్యా.. ఇప్పుడు రూపాయి లేకపోతే అడుగు కూడా బయట పెట్టలేం" అని మన టెక్నాలజీ లాజిక్కులను ప్రయోగిస్తాం. నిజమే.. కాలం మారింది. నాణేల చప్పుడు నోట్ల కట్టలుగా మారింది. ఇప్పుడు ఆ వీనుల విందు కూడా దూరమై మొబైల్ స్క్రీన్‌లపై డిజిటల్ నంబర్లుగా కరెన్సీ దర్శనమిస్తోంది. జీతాలు పెరిగాయి, విలాసాలు పెరిగాయి, చేతిలో ఐఫోన్లు మెరుస్తున్నాయి. కానీ, ఎవరికి వారు గుండెల మీద చెయ్యి వేసుకుని చెప్పండి.. ఆనందం పెరిగిందా? కనీసం పెరగకున్నా.. అప్పటి స్థాయి ఆనందం అయినా కనిపిస్తోందా? మానసిక ప్రశాంతత ఉందా? వీటికి ఇప్పుడు సమాధానాలు వెతికితే ముఖం నీరసించి పోతుంది. కాదంటారా?

## నేటి తరం - జీతాలు ఎక్కువ.. జీవన సుఖం తక్కువ

సీన్ కట్ చేస్తే... ఇప్పుడు ఐటీ కారిడార్లు, మల్టీనేషనల్ కంపెనీలు, స్టార్టప్‌లు. నెల తిరిగేసరికి అకౌంట్‌లో లక్షల రూపాయలు జమ అవుతున్నాయి. 25 ఏళ్లకే కార్లు, 30 ఏళ్లకే ఫ్లాట్లు కొనేస్తున్నారు. ఏది కావాలన్నా లోన్లు పెడుతున్నారు. ఈఎంఐలు కడుతున్నారు. బయట నుంచి చూస్తే అంతా కలర్‌ఫుల్. కానీ లోపల?

"జీతం బాగానే వస్తోంది కానీ, నెలాఖరుకు వచ్చేసరికి ఈఎంఐలు, క్రెడిట్ కార్డ్ బిల్లులు కట్టడానికే సరిపోతోంది. ఉద్యోగం ఎప్పుడు ఊడుతుందో అనే భయంతో రోజులు గడుపుతున్నాం." ఇదీ నేటి సగటు యువ ఉద్యోగి ఆవేదన. ఎందుకిలా జరుగుతోంది? సంపాదన పెరిగినా ఆందోళన ఎందుకు తగ్గడం లేదు? మానసిక ప్రశాంతత ఎందుకు దూరమవుతోంది? మనశ్శాంతి ఎందుకు కరువవుతోంది? దీనికి ప్రధాన కారణాలు విశ్లేషిస్తే.. మన ఆర్థిక అలవాట్లలోని లోపాలే అనేది స్పష్టంగా కనిపిస్తుంది. కానీ, మనం వాటిని గ్రహించినా.. మనసు చెప్పేదే వింటూ ఉంటాం. డాంబికాలకు పోతూ అప్పులు పెంచుకుంటున్నాం.




### ఇప్పుడే కావాలి అనే తపన..

పూర్వీకులు ఒక వస్తువు కొనాలంటే డబ్బులు దాచుకుని, సమయం కోసం ఎదురుచూసేవారు. కానీ, ఇప్పటి తరం 'ఇప్పుడే కొను, తర్వాత కట్టు' (Buy Now, Pay Later) అనే సంస్కృతికి అలవాటు పడిపోయింది. నచ్చిన ఫోన్ కనిపించిందా? జీరో డౌన్ పేమెంట్, నోకాస్ట్ ఈఎంఐ ఉందిగా, బుక్ చేసెయ్.మార్కెట్లో లేటెస్ట్ కారొచ్చిందా? ఉన్న కారును ఎక్స్ఛేంజ్ ఆఫర్ లో ఇచ్చేసెయ్.. ఇలా.. ఈ తొందరపాటు చేష్టలే మనల్ని ఇరుకున పెడుతన్నాయి.

### క్రెడిట్ కార్డ్ మాయాజాలం & ఈఎంఐ ఉచ్చు

ఈ రోజుల్లో క్రెడిట్ కార్డులు, పర్సనల్ లోన్లు చాలా సులభంగా దొరుకుతున్నాయి. దాంతో మనకు లేని డబ్బును, మనకు అవసరం లేని వస్తువుల కోసం, మనకు నచ్చని వ్యక్తులను మెప్పించడం కోసం ఖర్చు చేస్తున్నాం. ప్రతినెలా వచ్చే జీతంలో సగానికి పైగా ఈఎంఐలకే పోతుంటే, ఇక మానసిక స్థిరత్వం ఎక్కడ ఉంటుంది?

### 'ఫోమో' వ్యాధి..

ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్‌లలో పక్కింటి అబ్బాయో, ఆఫీస్ కొలీగో థాయిలాండ్ ట్రిప్ వెళ్లిన ఫోటోలు పెడితే చాలు.. మనకు లోపల మొదలవుతుంది ఆందోళన. "వాడు వెళ్లాడు, నేను వెళ్లకపోతే ఎలా?" అనే ఈ సామాజిక ఒత్తిడి (Social Peer Pressure) పెంచుకుంటున్నాం. మరుసటి యేడాది.. వాళ్లను తలదన్నే టూర్ కు ప్లాన్ చేసుకుంటాం. ఫలితంగా అవసరం లేకపోయినా, తప్పనిసరి కాకపోయినా ఖర్చులు పెంచేసుకుంటున్నాం. ఈఎంఐల ఉచ్చులో మునిగిపోతున్నాం.

## ఆర్థిక అభిమన్యులు



- అట్లూరి గణేష్, ఫైనాన్షియల్ ఎడ్యుకేటర్, ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంకర్, రచయిత.

## ఆర్థిక క్రమశిక్షణే... మానసిక ఆరోగ్యానికి ఔషధం

సంపాదన ఎంత అన్నది ముఖ్యం కాదు, మన "ఆర్థిక క్రమశిక్షణ" ఎంత అన్నదే ముఖ్యం. డబ్బు కేవలం వస్తువులను కొనడానికి మాత్రమే కాదు, అది మనకు "స్వేచ్ఛను", "ప్రశాంతతను" ఇవ్వడానికి ఉపయోగపడాలి. మన పూర్వీకుల లాగా మనం కూడా మానసికంగా ఆరోగ్యంగా, ఆనందంగా ఉండాలంటే కొన్ని ఆర్థిక క్రమశిక్షణా సూత్రాలు అవర్చుకోవాలి.

### అత్యవసర నిధి - మీ మానసిక రక్షణ కవచం..

ఉద్యోగం పోతుందేమోననే భయం మీ నిద్రను పాడు చేస్తోందా? అయితే మీ మొదటి కర్తవ్యం 'ఎమర్జెన్సీ ఫండ్' ఏర్పాటు చేసుకోవడం. మీ నెలవారీ ఖర్చులకు (ఈఎంఐలతో కలిపి) కనీసం 6 నెలల నుండి 9 నెలలకు సరిపడా డబ్బును లిక్విడ్ ఫండ్స్ లేదా బ్యాంకు ఎఫ్‌డీలలో దాచుకోండి. ఈ నిధి మీ అకౌంట్‌లో ఉంటే, ఆఫీసులో బాస్ గద్దలా అరిచినా మీ గుండెల్లో ధైర్యం ఉంటుంది. ఆ ధైర్యమే మీకు మానసిక స్థిరత్వాన్ని ఇస్తుంది.

### 50:30:20 సూత్రాన్ని పాటించండి :

ఆధునిక కాలానికి సరిపోయే అద్భుతమైన బడ్జెట్ సూత్రం ఇది. మీ చేతికి వచ్చే నికర ఆదాయాన్ని ఇలా విభజించండి:

- 50% అవసరాలు (Needs): ఇంటి రెంట్, కిరాణా, పిల్లల ఫీజులు, కరెంట్ బిల్లులు వంటి తప్పనిసరి ఖర్చులు.
- 30% కోరికలు (Wants): సినిమాలు, రెస్టారెంట్లు, ట్రిప్పులు, షాపింగ్.
- 20% పొదుపు & పెట్టుబడులు (Savings & Investments): భవిష్యత్తు కోసం మ్యూచువల్ ఫండ్స్, ఈక్విటీలు లేదా బాండ్లలో పెట్టుబడి.
- జీతం పెరిగే కొద్దీ పొదుపు శాతాన్ని పెంచాలే తప్ప, కోరికల శాతాన్ని కాదు. దీనినే 'లైఫ్‌స్టైల్ క్రీప్' (Lifestyle Creep) అంటారు. దీని బారిన పడకుండా ఉండటమే నిజమైన క్రమశిక్షణ.

### అప్పల ఊబి నుంచి బయటపడండి

క్రెడిట్ కార్డ్ బకాయిలు, పర్సనల్ లోన్లు మీ మానసిక ఆనందాన్ని హరించే నల్లత్రాచులు. వీలైనంత త్వరగా వాటిని తీర్చేయండి. 'డెట్ స్నోబాల్' (చిన్న అప్పుల నుండి పెద్ద అప్పులు తీర్చడం) పద్ధతిని ఫాలో కండి. హోమ్ లోన్ మినహా మిగిలిన కన్స్యూమర్ లోన్లకు దూరంగా ఉండటమే ప్రయోజనకరం అన గుర్తించండి.

### సంపద సృష్టిలో బ్యాలెన్స్ పాటించండి..

కేవలం సాంప్రదాయ పద్ధతుల్లోనే కాకుండా ఈక్విటీలు, మ్యూచువల్ ఫండ్స్ (SIP ద్వారా) పెట్టుబడి పెట్టడం ప్రారంభించండి. అయితే, వేగంతో పాటు స్థిరత్వం కూడా ముఖ్యమే. వయసును బట్టి ఈక్విటీ, డెట్ (బాండ్లు/ఎఫ్డీలు) ల మధ్య సమతుల్యతను పాటించినప్పుడే మార్కెట్ హెచ్చుతగ్గులకు గురైనప్పుడు ఆందోళన ఉండదు.

### గెలుపు అంటే కేవలం బ్యాంక్ బ్యాలెన్స్ కాదు

జీవితంలో అసలైన గెలుపు అంటే కోట్లలో సంపాదించడం మాత్రమే కాదు. రాత్రి పడుకునేటప్పుడు ఎలాంటి ఆందోళన లేకుండా, ప్రశాంతంగా కంటి నిండా నిద్రపోవడం. మన పూర్వీకులు ఆ విద్యలో టాపర్స్. వాళ్లు తక్కువ వనరులతోనే ఎక్కువ జీవితాన్ని ఆస్వాదించారు. నేటి తరం టెక్నాలజీని, ఎక్కువ సంపాదన అవకాశాలను చేజిక్కించుకుంది. దీనికి తోడు మన పెద్దల నాటి ఆ "ఆర్థిక క్రమశిక్షణ", "సంతృప్తి" అనే గుణాలను కూడా జోడిస్తే... మన సంపద మనతో పాటే పెరుగుతుంది, గుండెల్లో ప్రశాంతత, హృదయంలో మనశ్శాంతి దక్కుతుంది.

**గుర్తుంచుకోండి... డబ్బు మన జీవితాన్ని నడపాలి, కానీ, మన ప్రశాంతతను శాసించకూడదు. ఆర్థిక క్రమశిక్షణను అలవర్చుకుందాం, మానసిక ఆనందాన్ని సొంతం చేసుకుందాం.**




## పూర్వీకుల ఆనందం vs నేటి తరం ఆందోళన

ఎలా చూసినా మన పూర్వీకులు, తాతలు, తండ్రులు ఎప్పుడూ ఆనందంగానే కనిపించేవారు. కానీ, మన తరం మాత్రం ఎప్పుడు చూసినా ఆందోళనగానే కనిపిస్తోంది. ఈ రెండు తరాల మధ్య ఉన్న వ్యత్యాసాన్ని గమనిస్తే.. ఆర్థిక ఆలోచనా సరళి, వాటి వల్ల జీవితాలపై మానసిక ప్రభావాన్ని స్పష్టంగా అర్థం చేసుకోవచ్చు. తక్కువ వనరులతోనే మన పూర్వీకులు ప్రశాంతంగా బతికారు. ఆధునిక సౌకర్యాలు, ఎక్కువ సంపాదన ఉన్నా నేటి తరం మాత్రం ఒత్తిడిలో బతుకుతోంది.

### ఆర్థిక సూత్రం

**పూర్వీకుల తరం :** మన పెద్దల కాలంలో ఒక ప్రాథమిక సూత్రం ఉండేది "ఆదాయం పొదుపు ఖర్చు". అంటే జీతం రాగానే ముందుగా భవిష్యత్తు అవసరాల కోసం కొంత మొత్తాన్ని పక్కన పెట్టి, ఆ తర్వాత మిగిలిన డబ్బుతో మాత్రమే నెలంతా గడిపేవారు. ఇది వారి జీవితాలకు ఒక బలమైన ఆర్థిక పునాదిని ఇచ్చేది.

**నేటి తరం :** ఇప్పటి తరం రివర్స్ గేర్‌లో వెళ్తోంది."ఆదాయం ఖర్చు = పొదుపు". జీతం అకౌంట్‌లో పడగానే షాపింగ్‌లు, పార్టీలు, ఆన్‌లైన్ పర్చేజ్ లతో ఖర్చుల పండుగ చేసుకుంటారు. నెల ఆఖరుకు ఏదైనా మిగిలితే పొదుపు చేస్తారు, లేదంటే క్రెడిట్ కార్డులపై ఆధారపడతారు. ఈ అలవాటే నేటి తరాన్ని ఆర్థిక ఇబ్బందుల్లోకి నెట్టేస్తోంది.

### అప్పల వాటా..

**పూర్వీకుల తరం :** అప్పట్లో అప్పు చేయడం అనేది ఒక పెద్ద సామాజిక భయంతో కూడుకున్న విషయం. జీవితంలో అత్యంత కీలకమైన ఘట్టాలైన ఇల్లు కట్టుకోవడం లేదా పిల్లల పెళ్లిళ్లకు మాత్రమే చాలా ఆలోచించి, తప్పనిసరి పరిస్థితుల్లోనే అప్పు చేసేవారు. అది కూడా ఒక బాధ్యతగా భావించి త్వరగా తీర్చేసేవారు.

**నేటి తరం :** ప్రస్తుత కాలంలో అప్పుల రూపం మారింది. 'ఈఎంఐ' (EMI) అనే ముద్దుపేరుతో అప్పులు ప్రతి ఇంట్లోనూ భాగమవుతున్నాయి. ఫోన్, కారు, బట్టలు, చివరికి విహారయాత్రలకు అంటే వెకేషన్స్ కు కూడా సులభంగా లోన్లు దొరుకుతుండటంతో, ఇప్పటి తరం తెలియకుండానే అప్పుల ఊబిలో కూరుకుపోతోంది. ప్రతినెలా వచ్చే సంపాదన చేతికి రాకముందే ఈఎంఐల రూపంలో బ్యాంకు అకౌంట్ నుంచే కట్ అయిపోతోంది.

### జీవన శైలి..

**పూర్వీకుల తరం :** మన పూర్వీకుల జీవన విధానం చాలా సాదాసీదాగా ఉండేది. సమాజంలో లేదా పక్కింటివారితో పోటీ పడాలనే ఆరాటం వారిలో ఉండేది కాదు. "ఉన్నదానితో తృప్తి పడటం" అనే సూత్రం వల్ల మానసికంగా వారు చాలా బలంగా ఉండేవారు. ఆడంబరాల కంటే అవసరాలకే ప్రాధాన్యత ఇచ్చారు.

**నేటి తరం :** ఇప్పటి లైఫ్‌స్టైల్ పూర్తిగా 'సోషల్ మీడియా' మరియు 'పోలికల' (FOMO Fear of Missing Out) చుట్టూ తిరుగుతోంది. పక్కింటివాడు లేదా ఆఫీస్ కొలీగ్ కొన్నాడని కార్లు, ఐఫోన్లు మార్చడం, ఆడంబరాల కోసం బడ్జెట్‌ను మించి ఖర్చు చేయడం నేటి తరం ఫ్యాషన్‌గా మార్చుకుంది. ఈ ప్రదర్శన బుద్ధి (Showoff Culture) వారి జేబులకు చిల్లులు పెడుతోంది.

### మానసిక స్థితి ..

**పూర్వీకుల తరం :** పైన పేర్కొన్న మూడు సూత్రాల (సరైన పొదుపు, తక్కువ అప్పులు, సామాన్య జీవనం) వల్ల వారిపై ఎలాంటి ఆర్థిక భారం ఉండేది కాదు. సంపాదన తక్కువైనా, రేపటి గురించి భయం లేకుండా రాత్రి పూట ప్రశాంతంగా నిద్రపోయేవారు. మానసిక ఆరోగ్యమే వారి అసలైన సంపదగా నిలిచింది.

**నేటి తరం :** కార్పొరేట్ ఉద్యోగాలు, లక్షల జీతాలు ఉన్నప్పటికీ ఇప్పటి తరం ఎప్పుడూ ఆందోళనతోనే బతుకుతోంది. దీనికి కారణం నెలకు వచ్చే భారీ ఈఎంఐలు, ఉద్యోగ భద్రత లేకపోవడం. ఒక్క నెల జీతం ఆగినా జీవితం ఎక్కడ అస్తవ్యస్తం అవుతుందో అనే భయం వారిని నిరంతరం వెంటాడుతూ, తీవ్రమైన మానసిక ఒత్తిడికి మరియు గుండె జబ్బులకు కారణమవుతోంది.

# ప్రభుత్వాసుపత్రుల్లో రక్షణ ఏదీ?

- ఇందిరమ్మ పాలనలో బాలింతకు కూడా భరోసా లేదు
- బాన్సువాడ ఘటనపై స్పందించని ప్రభుత్వం
- నిమ్స్‌లో బాలింతను పరామర్శించిన మాజీ మంత్రి హరీష్ రావు



**హైదరాబాద్, జూలై 20 (మన చౌరాస్తా) :** ఇందిరమ్మ పాలనలో మహిళలకు రక్షణ లేకుండా పోయిందని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు విమర్శించారు. బాన్సువాడ మాతా శిశు ఆస్పత్రిలో చికిత్స వికటించి, నిమ్స్ ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్న బాలింతలను హరీశ్‌రావు పరామర్శించారు. అనంతరం హరీశ్‌రావు మీడియాతో మాట్లాడుతూ.. ఈ ఘటన జరిగిన పది రోజులవుతున్నా ప్రభుత్వం నుంచి కనీస స్పందన లేదని మండిపడ్డారు. ఇంత జరిగినా ప్రభుత్వం ఎందుకు విచారణ జరపడం లేదని ప్రశ్నించారు. బాధ్యులైన వారిపై వెంటనే కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఐదుగురు బాలింతలు నిమ్స్‌లో చికిత్స పొందుతున్నార హరీశ్‌రావు తెలిపారు. వీరిలో ముగ్గురు డయాలసిస్‌పై ఉన్నారని పేర్కొన్నారు. తెల్లరక్తకణాలు తగ్గాయి.. కిడ్నీ, లంగ్స్ ఇన్‌ఫెక్షన్లతో బాధపడుతున్నారని చెప్పారు. బాలింతల నుంచి పసిగుడ్డులకు ఇన్‌ఫెక్షన్ సోకిందని తెలిపారు. బాలింతల నుంచి పాలు తాగడం వల్ల నీలోఫర్‌లో పసిగుడ్డులు చికిత్స పొందుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. బాలింతలు పూర్తిగా కోలుకోకుండా పసిగుడ్డులను ఎవరు చూసుకుంటారని హరీశ్‌రావు ప్రశ్నించారు. ఆరుగురికి 10వ తేదీన ఇన్‌ఫెక్షన్ వచ్చిందని, నలుగురికి 11వ తేదీన సిజేరియన్ చేశారని హరీశ్‌రావు తెలిపారు. థియేటర్ మెయింటెనెన్స్ సరిగ్గా లేక ఇన్‌ఫెక్షన్ సోకిందని బాధితులు అంటున్నారని అన్నారు. వైద్యుల నిర్లక్ష్యం కూడా కారణమని అంటున్నారని అన్నారు. కాలం చెల్లిన మందులు వాడినందుకే ఈ పరిస్థితి వచ్చింటున్నారని తెలిపారు. ఇంత జరిగినా ప్రభుత్వం ఎందుకు విచారణ జరపడం లేదని ప్రశ్నించారు. ఘటన జరిగిన పది రోజులవుతున్నా ప్రభుత్వం నుంచి కనీస స్పందన లేదని మండిపడ్డారు. వైద్యారోగ్య అధికారులు కనీసం పరామర్శించిన పాపాన పోలేదని విమర్శించారు. ఘటన నుంచి గురించి పూర్తిస్థాయి విచారణకు ఆదేశించలేదని అన్నారు. బాధ్యులైన వారిపై వెంటనే కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఒక పేషెంట్ నగలు అమ్మి, అప్పు తెచ్చి వైద్య చికిత్సలు చేయించామని కుటుంబీకులు చెప్పారని హరీశ్‌రావు తెలిపారు. ఇంత జరిగినా ప్రభుత్వానికి చీమకుట్టినట్లుగా కూడా లేదని విమర్శించారు. ఇందిరమ్మ పాలనలో మహిళలకు రక్షణ లేకుండా పోయిందని అన్నారు. కేసీఆర్ హయాంలో గర్భిణులకు న్యూట్రీషన్ కిట్, బాలింతలకు కేసీఆర్ కిట్‌లు ఇచ్చామని తెలిపారు. మహిళల ఆరోగ్యం కోసం ఆరోగ్య మహిళ కార్యక్రమాన్ని ప్రారంభించామని పేర్కొన్నారు. అమ్మ ఒడి వాహనాల్లో బాలింతలను సురక్షితంగా ఇళ్లకు చేర్చామని చెప్పారు. కానీ ఇప్పుడు కాంగ్రెస్ హయాంలో ప్రభుత్వ ఆస్పత్రుల్లో డెలివరీలు గణనీయంగా తగ్గాయని అన్నారు.



బాలిక పట్ల అనుచితంగా

# ప్రవర్తించిన పోలీస్

■ **పోక్సో కేసు నమోదు చేసి కానిస్టేబుల్ అరెస్ట్**



**నల్లగొండ, జూలై 20 ( మన చౌరాస్తా) :** బాలికతో అసభ్యంగా ప్రవర్తించాడని ఓ పోలీస్ కానిస్టేబుల్‌పై పోక్సో కేసు నమోదైంది.ఈ మేరకు గుర్రంపోడ్ పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న కానిస్టేబుల్ సత్యనారాయణను నల్గొండ వన్‌టౌన్ పోలీసులు అరెస్టు చేశారు. వివరాల్లోకి వెళ్తే.. ఇటీవల సైకిల్‌పై వెళ్తున్న ఓ బాలికను నిందితుడు అడ్డగించి, ఆమెతో అసభ్యంగా వ్యవహరించాడు. అనుచితంగా తాకి వేధించాడు. ఇంటికి వెళ్లాక బాలిక ఈ విషయాన్ని తన తల్లిదండ్రులకు చెప్పింది. వారు వెంటనే వన్‌టౌన్ పోలీసులను ఆశ్రయించారు. బాధిత కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు పోక్సో చట్టం కింద పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఈ క్రమంలో ఘటనాస్థలిలోని సీసీటీవీ ఫుటేజ్‌లను పరిశీలించారు. నిందితుడు మాస్క్ ధరించి, పలుచోట్ల తిరిగినట్లుగా గుర్తించారు. సదరు మాస్క్ వ్యక్తి గురించి ఎంక్వైరీ చేయగా.. గుర్రంపోడ్ పోలీస్ స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న సత్యనారాయణ అని తెలిసింది. దీంతో అతన్ని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. కాగా, నకిరేకల్‌లో విధులు నిర్వహిస్తున్న సమయంలో కూడా సత్యనారాయణపై రెండు పోక్సో కేసులు నమోదైనట్లుగా తెలుస్తోంది. స్టేషన్‌కు వచ్చే మహిళల పట్ల కూడా అనుచితంగా ప్రవర్తిస్తాడనే ఆరోపణలు ఉన్నాయి.

ఆక్వా రంగాన్ని కష్టాల నుంచి

# గట్టెక్కించండి

■ **ముగ్గురు కేంద్ర మంత్రులకు వేర్వేరుగా బాబు లేఖలు**



**అమరావతి, జూలై20 (మన చౌరాస్తా) :** ఏపీలో ఆక్వా, రైతు సమస్యల పరిష్కారానికి కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని సీఎం చంద్రబాబు కోరారు. ఈ మేరకు ముగ్గురు కేంద్రమంత్రులకు ఆయన వేర్వేరుగా లేఖలు రాశారు. జన్యుపరంగా మార్పు చేసిన సోయాబీన్ మీల్‌ను దిగుమతి చేసుకునేందుకు రొయ్యల మేత తయారీదారులకు అనుమతి ఇవ్వాలని కేంద్ర మత్స్యశాఖ మంత్రి రాజీవ్ రంజన్‌సింగ్‌ను సీఎం కోరారు. ఆక్వా రంగాన్ని కాపాడేందుకు చర్యలు తీసుకోవాలని.. ఏపీ నుంచి ఎఫ్‌సీవీ పొగాకు ఎగుమతులకు ప్రోత్సాహకాలు ఇవ్వాలని కేంద్ర వాణిజ్యశాఖ మంత్రి పీయూష్ గోయల్‌కు విజ్ఞప్తి చేశారు. ఆక్వా రంగంలో జీఎస్టీని 18 నుంచి 5 శాతానికి తగ్గించాలని కేంద్ర ఆర్థికశాఖ మంత్రి నిర్మలా సీతారామన్‌ను సీఎం చంద్రబాబు కోరారు. రాష్ట్రంలో ఆక్వా రంగాన్ని మరింత అభివృద్ధి చేయటంతో పాటు ఎప్పటికప్పుడు సహకారం అందించేందుకు వీలుగా జాతీయ మత్స్య అభివృద్ధి బోర్డు ప్రాంతీయ కార్యాలయాన్ని రాజధాని అమరావతిలో ఏర్పాటు చేయాలని సీఎం మరో లేఖలో కేంద్రమంత్రి రాజీవ్ రంజన్‌సింగ్‌ను కోరారు. ఈ ఏడాది జూన్ 5న విశాఖలో జరిగిన సీఫుడ్ ఎక్స్‌పోర్ట్స్ వర్క్‌షాప్‌లో అమరావతిలో ఎనఎఫ్‌డీబీ ప్రాంతీయ కార్యాలయం ఏర్పాటుకు హామీ ఇచ్చారన్నారు. రాజధాని పరిధిలోని నెక్కల్లులో 7.89 ఎకరాల ప్రభుత్వ భూమిని దీనికోసం కేటాయించామన్నారు. తక్షణం ఈ భూమిని స్వాధీనం చేసుకుని నిర్మాణాలు ప్రారంభించాలని కేంద్రమంత్రిని సీఎం కోరారు. 2028 నాటికి ప్రాంతీయ కార్యాలయం, అక్వేరియం, శిక్షణ కేంద్రాల పనులు పూర్తి చేసి అందుబాటులోకి తేవాలని చంద్రబాబు విజ్ఞప్తి చేశారు. ఈ ప్రాంతీయ కేంద్రం బ్లూ ఎకానమీ అభివృద్ధికి ప్రధాన కేంద్రంగా మారుతుందన్నారు. పొగాకు ఎగుమతిని ప్రోత్సహించాలని కోరారు. ఏరియేటర్లు, ప్రాసెస్ చేయని పొగాకుపై జీఎస్టీ తగ్గించాలన్నారు. బ్లూ ఎకానమీకి సహకారం ఇవ్వాలని.. సీఎం కోరారు. నిర్యాత్ ప్రోత్సాహన్ పథకాన్ని వర్తింపచేయాలన్నారు. కిసాన్ క్రెడిట్ కార్డుపై రూ.5 లక్షల టాప్ అప్ ఇవ్వాలని కేంద్ర మంత్రులకు రాసిన లేఖలో సీఎం చంద్రబాబు వినతి చేశారు.

# రోడ్డు దాటుతుండగా ఆటో ఢీ

■ **వ్యక్తి అక్కడికక్కడే దుర్మరణం.. హైదర్ నగర్‌లో ఘటన**

**హైదరాబాద్, జూలై20 (మన చౌరాస్తా ) :** నగరంలోని కూకట్‌పల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతిచెందారు. హైదర్‌నగర్ వద్ద రోడ్ క్రాస్ చేస్తుండగా ఆటో ఢీ కొట్టడంతో నర్సింహ(60) అనే వ్యక్తి అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయాడు. సమాచారం అందిన వెంటనే పోలీసులు అక్కడకు చేరుకుని మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించారు. ప్రమాదానికి సంబంధించి వీడియో సీసీటీవీ కెమెరాలో రికార్ట్ అయ్యింది. మృతుడు జహీరాబాద్‌లోని శిశుమందిర్ స్కూల్‌లో టీచర్‌గా పనిచేసి రిటైర్ అయినట్లు పోలీసులు తెలిపారు. హైదరాబాద్‌లో ఉంటూ జహీరాబాద్‌లో ఇల్లు కన్‌స్ట్రక్షన్ చేయిస్తున్నాడు. ఈ క్రమంలో ఈరోజు (సోమవారం) జహీరాబాద్ వెళ్లేందుకు రోడ్డు దాటుతుండగా వేగంగా దూసుకొచ్చిన ఆటో.. నర్సింహను బలంగా ఢీకొట్టింది. తీవ్రంగా గాయపడిన ఆయన స్పాట్‌లోనే మృతిచెందాడు. ఈ ప్రమాదంపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. నర్సింహ మృతి సమాచారాన్ని కుటుంబసభ్యులకు తెలియజేశారు.






శ్రీనివాసమంగాపురంలో

# పార్వేట ఉత్సవం

■ **సంప్రదాయ సంగీతం, కోలాటాల మధ్య నిర్వహణ**

**తిరుపతి, జూలై 20 (మన చౌరాస్తా) :** శ్రీనివాసమంగాపురంలోని శ్రీ కల్యాణ వేంకటేశ్వరస్వామివారి వార్షిక పార్వేట ఉత్సవాన్ని సోమవారం అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. వేద మంత్రాలు, సంప్రదాయ సంగీతం నడుమ ఉదయం ఉత్సవ దేవతా విగ్రహాలను ఆలయం నుంచి పార్వేట మండపం వరకు ఊరేగింపుగా తీసుకెళ్లారు. నైవేద్యాల అనంతరం పార్వేట ఉత్సవాలన్ని నిర్వహించారు. ఈ ఉత్సవంలో భాగంగా తితిదే అన్నమాచార్య ప్రాజెక్టు కళాకారులు భక్తిశ్రద్ధలతో సంకీర్తనలు చేయగా.. భజన బృందాలు భక్తి గీతాలు కోలాటం ప్రదర్శించాయి. శ్రీవారి మెట్టు వద్ద భక్తులకు అన్నప్రసాదాలు పంపిణీ చేశారు. శ్రీవేంకటేశ్వరస్వామి వారు నడిచిన పవిత్ర మార్గంగా భక్తులు విశ్వసించే శ్రీవారిమెట్టు సమీపంలో ఉన్న శ్రీనివాసమంగాపురం శ్రీ కల్యాణ వేంకటేశ్వరస్వామివారి పార్వేట ఉత్సవం అత్యంత వైభవంగా జరిగింది. ఉదయం 7 గంటలకు ఆలయం నుంచి ఉత్సవమూర్తులు మంగళవాయిద్యాలు, వేదమంత్రోచ్చారణల మధ్య ఊరేగింపుగా బయలుదేరి శ్రీవారిమెట్టు సమీపంలోని పార్వేట మండపానికి చేరుకున్నారు. అక్కడ క్షేమతలిగ నివేదన అనంతరం పార్వేట ఉత్సవాన్ని నిర్వహించారు. దుష్టశిక్షణకు ప్రతీకగా స్వామివారు మూడు సార్లు బల్లెంను ప్రయోగించే విశిష్ట ఘట్టం భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. అనంతరం ఆస్థానం నిర్వహించారు. తరువాత సాయంత్రం ఉత్సవమూర్తులను తిరిగి ఆలయానికి తీసుకువచ్చారు. పార్వేట ఉత్సవం సందర్భంగా టీటీడీ అన్నమాచార్య ప్రాజెక్టు కళాకారులు భక్తి సంకీర్తనలు ఆలపించి ఆధ్యాత్మిక వాతావరణాన్ని నెలకొల్పారు. భజన బృందాలు భజనలు, కోలాటాలతో భక్తులను అలరించగా, అనంతరం విచ్చేసిన భక్తులకు అన్నప్రసాదాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జేఈవో డా.ఎ.శరత్, ఆలయ ప్రత్యేకశ్రేణి డెప్యూటీ ఈవో వరలక్ష్మి, ఏఈవో గోపినాథ్, సూపరింటెండెంట్ రాజ్‌కుమార్, ఆలయ అర్చకులు బాలాజీ రంగాచార్యులు, టెంపుల్ ఇన్‌స్పెక్టర్లు మునికుమార్, ధనశేఖర్‌జయ, ఇతర అధికారులు, అర్చకులు, విశేష సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.





## పామాయిల్ పెంపకం

# రైతులకు లాభదాయకం

- వర్షా భావంలోనూ పంటరకు ఢోకా లేదు
- పామాయిల్ ధరల పెంపునకు కృషి చేస్తున్నాం
- అంజనాపురంలో గోద్రెజ్ పామ్ ఫ్యాక్టరీ ప్రారంభం
- మంత్రి తుమ్మలతో కలసి ప్రారంభించిన డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

**ఖమ్మం, జూలై 20 (మన చౌరాస్తా) :** పామాయిల్ ధర పెంపునకు తమ ప్రభుత్వం కృషి చేస్తోందని తెలంగాణ ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క వ్యాఖ్యానించారు. ఖమ్మం జిల్లా వ్యవసాయంపై ఆధారపడిన జిల్లా అని పేర్కొన్నారు. సోమవారం ఖమ్మం జిల్లా కొణిజర్ల మండలం అంజనాపురం గ్రామంలో నూతనంగా నిర్మించిన గోద్రెజ్ ఆయిల్ పామ్ ఫ్యాక్టరీని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావులు కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా భట్టి విక్రమార్క మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఈ కార్యక్రమానికి హాజరు కావాల్సి ఉందని.. వివిధ కారణాలతో సీఎం రాలేకపోయారని చెప్పుకొచ్చారు. ఈ సందర్భంగా రైతులకు సీఎం రేవంత్‌రెడ్డి తన శుభాకాంక్షలు తెలిపారని అన్నారు. అంజనాపురంలో ఆయిల్ పామ్ కాంప్లెక్స్ నిర్మించిన గోద్రెజ్ సంస్థకు భట్టి విక్రమార్క కృతజ్ఞతలు తెలిపారు. ఖమ్మం జిల్లాలో ఆయిల్ పామ్ ఫ్యాక్టరీ నిర్మాణానికి విశేషంగా కృషిచేసిన మంత్రి తుమ్మల నాగేశ్వరరావుకి అభినందనలు చెప్పారు. ఖమ్మం జిల్లా రైతన్నలు అన్ని రకాల పంటలు సాగు చేస్తారని వెల్లడించారు. తాను ఎన్నో రకాల పంటలు సాగు చేశానని ఏ పంటకు రాని దిగుబడి ఆయిల్ పామ్‌కు వచ్చిందని మంత్రి తుమ్మల స్వయంగా తనతో చెప్పారని అన్నారు. చివరకు ప్రకృతి విపత్తులను కూడా ఈ పంట తట్టుకొని నిలబడుతుందని చెప్పుకొచ్చారు. పామాయిల్ సాగు చేసిన రైతులకు ఎంతో మేలు జరుగుతుందని వెల్లడించారు. దేశంలో 25 లక్షల మిలియన్ టన్నుల పామాయిల్ అవసరం ఉందని తెలిపారు. దేశంలో కేవలం 12 లక్షల మిలియన్ టన్నుల పామాయిల్ మాత్రమే ఉత్పత్తి అవుతుందని చెప్పుకొచ్చారు. 1992లో ప్రారంభించిన పామాయిల్ సాగు ఇప్పటికి దేశంలోనే తెలంగాణను అగ్రగామిగా నిలిపే స్థాయికి వచ్చిందని భట్టి విక్రమార్క వివరించారు. గతంలో పామాయిల్ టన్ను గెల ధర రూ.12000లు ఉంటే.. నేడు టన్ను ధర రూ.23 వేలకు పెరిగిందని వెల్లడించారు. అంజనాపురంలో ఆయిల్ పామ్ ఫ్యాక్టరీ నిర్మాణం.. ఖమ్మం జిల్లా అన్నదాతలకు ఓ వరమని ఉద్ఘాటించారు. వ్యవసాయ ఉత్పత్తుల పరిశ్రమలకు ఉమ్మడి ఖమ్మం జిల్లా వేదిక కాబోతోందని తెలిపారు. రాబోయే రోజుల్లో అనేక రకాల పరిశ్రమలు ఇక్కడికి రాబోతున్నాయని భట్టి విక్రమార్క పేర్కొన్నారు. జిల్లాలో గోద్రెజ్ కంపెనీ ఆయిల్ పామ్ కాంప్లెక్స్ నిర్మించడం సంతోషంగా ఉందని మంత్రి తుమ్మల పేర్కొన్నారు. ఈ కాంప్లెక్స్‌లో అత్యాధునిక సీడ్ గార్డెన్ ఏర్పాటు చేశారని తెలిపారు. గోద్రెజ్ కంపెనీకి అవసరమైన అన్ని సౌకర్యాలను కల్పిస్తున్నామని, రైతులకు అన్ని విధాలా అందుబాటులో ఉండేలా కంపెనీ సేవలందించాలని ఆకాంక్షించారు. ఆయిల్ పామ్ సాగులో తెలంగాణ ముందు ఉందని మంత్రి తుమ్మల తెలిపారు. రాష్ట్రంలో పది లక్షల ఎకరాల్లో ఆయిల్ పామ్ సాగుకు కృషి జరుగుతోందని చెప్పారు. ఈ సందర్భంగా రైతులంతా ఈ పంట సాగుకు ముందుకు రావాలని ఆయన పిలుపునిచ్చారు. ఆయిల్ పామ్‌తో ఎలాంటి నష్టం ఉండదన్నారు. ఆయిల్ పామ్ కింద ఇప్పటికే మూడు ఫ్యాక్టరీల నిర్మాణం పూర్తయిందని, మరో ఆరు ఫ్యాక్టరీల నిర్మాణం జరుగుతోందని వెల్లడించారు. తెలంగాణ భూములు ఆయిల్ పామ్ సాగుకు అనుకూలమని మంత్రి పేర్కొన్నారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వంలో అన్ని జిల్లాల్లో ఆయిల్ పామ్ ఫ్యాక్టరీల నిర్మాణం జరగాలన్నదే తన లక్ష్యమని చెప్పుకొచ్చారు. దక్షిణ భారతదేశ నేతలందరూ ఆయిల్ పామ్ దిగుమతిపై సుంకం తగ్గించాలని కోరుతున్నామని మంత్రి చెప్పారు. ఈ మేరకు కేంద్ర ప్రభుత్వం సహకరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. రైతులకు అవసరమైన అన్ని వసతులు కల్పిస్తున్నామని, ఆయిల్ పామ్ సాగుతో వారి జీవితాల్లో వెలుగులు నింపుతామన్నారు మంత్రి తుమ్మల. తన యాభై సంవత్సరాల వ్యవసాయ అనుభవంలో ఎన్నో పంటలు పండించామని, ఏ పంటకు రాని ఆదాయం దీనికి వస్తుందన్నారు. ఆయిల్ పామ్‌ను ఎన్టీఆర్ ప్రవేశపెట్టిన నాటి నుంచి తాను కూడా సాగు చేస్తున్నట్లు ఆయన వెల్లడించారు. మరోవైపు, ఎల్‌నినో ప్రపంచాన్ని కబళించే పరిస్థితి ఉందని మంత్రి తుమ్మల పేర్కొన్నారు. దాని కారణంగా రుతుపవనాలు సరిగా రాలేదని, మానవజాతి చేసిన విధ్వంసం తిరిగి మన పాలిటే మహమ్మారిగా మారిందన్నారు. దక్షిణ భారతదేశంలో ఎల్‌నినో ప్రభావం ఎక్కువగా ఉందని, ఉద్యానవన పంటల సాగుతో భూములను చల్లబరచాలని మంత్రి తుమ్మల పేర్కొన్నారు.





# విద్యా ప్రమాణాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలి

- గురుకుల విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు క్రమశిక్షణ, పోషకాహారం అందించాలి
- పోషకాహారంపై విద్యార్థులకు అవగాహన
- మెనూ ప్రకారమే భోజనం అందించాలి
- జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా
- కొడకండ్ల ఎంజేపీలో ఆకస్మిక తనిఖీలు

**కొడకండ్ల, మన చౌరాస్తా :** గురుకుల విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు క్రమశిక్షణ, పోషకాహారం అందించాలని కలెక్టర్ సందీప్ కుమార్ ఝా అన్నారు. సోమవారం జిల్లాలోని కొడకండ్ల మండలంలోని మొండ్రాయి మహాత్మా జ్యోతి భా పూలే బీసీ సంక్షేమ గురుకుల పాఠశాలను కలెక్టర్ ఆకస్మికంగా సందర్శించి, విద్యా బోధన, మౌలిక సదుపాయాలు, విద్యార్థుల అభ్యాస సామర్థ్యం, పరిశుభ్రత, ఆహార నాణ్యత, తదితర అంశాలను క్షుణ్ణంగా పరిశీలించారు. పాఠశాలలోని స్టోర్ రూమ్‌ను తనిఖీ చేసిన కలెక్టర్, అక్కడ నిల్వ ఉంచిన పాత పుస్తకాలను పరిశీలించారు. ఉపయోగంలో లేని పాత పుస్తకాలను వెంటనే వేరు చేసి, ఈ రోజు సాయంత్రం లోగా స్టోర్ రూమ్‌ను పూర్తిగా శుభ్రం చేసి, అవసరం లేని వస్తువులను తొలగించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. పాఠశాలలో ప్రతి గది పరిశుభ్రంగా, క్రమబద్ధంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. అనంతరం కంప్యూటర్ ల్యాబ్‌ను పర్యవేక్షించి, కంప్యూటర్ల వినియోగం, విద్యార్థులకు అందుతున్న డిజిటల్ విద్యా సదుపాయాల గురించి ఆరా తీశారు. ప్రతి విద్యార్థి కంప్యూటర్ పరిజ్ఞానం పెంపొందించుకునేలా ప్రణాళికాబద్ధంగా శిక్షణ అందించాలని ఉపాధ్యాయులకు సూచించారు. తదుపరి 10వ తరగతి గదిని సందర్శించిన కలెక్టర్, బోధన విధానాన్ని ప్రత్యక్షంగా పరిశీలించారు. గణిత ఉపాధ్యాయురాలికి ఒక గణిత సమస్యను ఇచ్చి దాన్ని సాధించాలని తెలిపారు. అలాగే విద్యార్థులకు కూడా మాథ్స్ లోని కొన్ని సమస్య లను ఇచ్చి వాటిని పరిష్కరించాలని తెలియజేసి వారి పరిజ్ఞానాన్ని పరిశీలించారు. అనంతరం కలెక్టర్ స్వయం గా ఆ సమస్యలను సులభంగా ఎలా చేదించాలో వారికి బోధించారు. ప్రతి అంశాన్ని భావనతో వివరించేలా ఉపాధ్యాయులు శ్రద్ధ వహించాలని సూచించారు. అదే విధంగా హిందీ పాఠ్య పుస్తకంలోని కొన్ని పాఠాలను కలెక్టర్ స్వయంగా చదివి వినిపించారు. పదాల ఉచ్చారణ, చదివే తీరు, భావవ్యక్తీకరణ ఎలా ఉండాలో విద్యార్థులకు వివరించి చూపించారు. ప్రతి రోజూ విద్యార్థులతో పాఠ్య పుస్తకాల పఠనంపై ప్రత్యేకంగా సాధన నిర్వహించాలని, తద్వారా భాషా నైపుణ్యాలు, ఆత్మవిశ్వాసం పెరుగుతాయని ఉపాధ్యాయులకు సూచించారు. విద్యార్థులతో ఆప్యాయంగా మాట్లాడిన కలెక్టర్ 'ఈ రోజు బ్రేక్ ఫాస్ట్‌లో ఏమి తిన్నారు?' అని అడిగి తెలుసుకున్నారు. ప్రతి రోజూ అందించే ఆహారాన్ని పూర్తిగా తీసుకోవాలని, ముఖ్యంగా పాలను తప్పకుండా తాగాలని విద్యార్థులకు సూచించారు. ఆరోగ్యవంతమైన శరీరం ఉన్నప్పుడే చదువులో మంచి ఫలితాలు సాధించగలరన్నారు. అనంతరం వంట శాల వద్ద ప్రదర్శించిన మెనూ చార్ట్‌ను పరిశీలించిన కలెక్టర్, అందులో పేర్కొన్న విధంగానే ఆహారం వండుతున్నారా? లేదా? అని తనిఖీ చేశారు. విద్యార్థులకు ప్రభుత్వం నిర్దేశించిన మెనూ ప్రకారం నాణ్యమైన, పోషకాహారం అందించాలని, ఎట్టి పరిస్థితుల్లోనూ నాణ్యతలో గాని మెనూ ప్రకారం గా భోజనం అందించకపోతే చర్యలు తప్పవన్నారు. పాఠశాలలో విద్యార్థులకు నాణ్యమైన విద్య, క్రమశిక్షణ, పరిశుభ్రమైన వాతావరణం, పోషకాహారం, ఆధునిక విద్యా సదుపాయాలు అందుబాటులో ఉండేలా అధికారులు, ఉపాధ్యాయులు నిరంతరం పర్యవేక్షణ చేపట్టాలని కలెక్టర్ స్పష్టం చేశారు.

## నేడు,రేపు కొడంగల్‌లో సీఎం పర్యటన



**హైదరాబాద్, జూలై 20 (మన చౌరాస్తా) :** నేటి నుంచి రెండు రోజులపాటు కొడంగల్ నియోజకవర్గంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పర్యటించనున్నారు. ఎడ్యుకేషన్ హబ్ పనుల పరిశీలించి, నియోజకవర్గ అభివృద్ధి పనులపై సమీక్షించనున్నట్లు ఒక ప్రకటనలో తెలిపారు. మంగళవారం సాయంత్రం 4 గంటలకు దుద్యాల్ మండలం, హకీంపేట గ్రామంలోని ఎడ్యుకేషన్ హబ్ ను పరిశీలించనున్నారు. సాయంత్రం 5 గంటలకు కొడంగల్ నియోజకవర్గంలోని అన్ని అభివృద్ధి పనులపై అధికారులతో సమీక్షించనున్నారు. రాత్రికి కొడంగల్ లోనే బస చేయనున్న ముఖ్యమంత్రి, బుదశారం 10 గంటలకు స్థానిక నాయకులు, సమీక్ష నిర్వహించనున్నారు. అనంతరం తిరిగి హైదరాబాద్ చేరుకోనున్నట్లు ప్రకటించారు.

## సాగు విధానాలు మార్చుకోవాలి

- అధికారులు రైతులకు అవగాహన కల్పించాలి
- కలెక్టర్ సందీప్ కుమార్ ఝా

**కొడకండ్ల, మన చౌరాస్తా :** ప్రస్తుతం ఉన్న వర్షాభావ పరిస్థితులను దృష్టిలో పెట్టుకొని జిల్లాలో ఆరుతడి పంటలను రైతులు పండించాలని కలెక్టర్ సందీప్ కుమార్ ఝా సూచించారు. కొడకండ్ల మండలం మొండ్రాయి లో కొమ్ము మహేందర్ కూరగాయ క్షేత్రాన్ని కలెక్టర్ సోమవారం సందర్శించి కూరగాయల పంటల సాగు తీరును పరిశీలించారు. రైతు తనకున్న రెండున్నర ఎకరాల సాగు విస్తీర్ణంలో ఎకరంలో 10 గుంటలు దోసకాయ సాగు, పది గుంటలలో బెండకాయ, 10 గుంటలు చిక్కుడు సాగు చేస్తున్నారు. అంతేకాకుండా ఇంకో ఎకరంలో పచ్చిమిర్చి, టమాటా నారు సిద్ధం చేసుకుని పంట వేయడానికి నేలను తయారు చేసుకుంటున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మొండ్రాయి గ్రామం, చుట్టుపక్కల తండాలకు చెందిన రైతులతో మాట్లాడుతూ వరి పంట, కూరగాయల పంటల సాగులో లాభాల తీరును అడిగి తెలుసుకున్నారు. వరి పంట కంటే కూరగాయల సాగు వల్లే లాభాలు బాగా వస్తున్నాయని కూరగాయల సాగు వల్ల ప్రతీ రోజూ ఆదాయం ఉంటుందని రైతులు తెలిపారు. వరి తో పోలిస్తే ఆరుతడి పంటలు కూరగాయలకు తక్కువ నీళ్లు అవసరమవుతుందని.. దిగుబడి కూడా అధికంగా రావడం జరుగుతుందని..రైతుకు ఆదాయం కూడా ఎక్కువ వస్తున్నది. రైతులు వరికి బదులుగా ఈ సంవత్సరం ఉన్న వర్షాభావ పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని కూరగాయలు సాగులో ముందుకు వెళ్లాలని కలెక్టర్ సూచించారు. ఉద్యాన, వ్యవసాయ అధికారులు క్షేత్రస్థాయిలో రైతులకు అవగాహన కల్పించాలని కూడా దిశా నిర్దేశం చేశారు. కోతుల బెడద ఉండడం వల్ల.. సాగు విస్తీర్ణం తగ్గుతుందని రైతులు కలెక్టర్ కి తెలపగా... దానికి కలెక్టర్ స్పందించి జనగామ మున్సిపల్ కమిషనర్ దగ్గర ఉన్నటువంటి కోతులు పట్టే వాళ్ళ వివరాలు తీసుకొని గ్రామ సర్పంచ్ జి.వెంకన్న మున్సిపల్ కమిషనర్ తో కోఆర్డినేట్ చేసుకొని గ్రామంలో కోతులు ఎక్కడెక్కడ ఉన్నాయో..వాటిని పట్టించి రైతులకు కోతుల నుంచి విముక్తి కలిగేలా చూడాలన్నారు. ఎలినినో ప్రభావం వల్ల ఈ ఏడాది వర్షాలు తక్కువగా నమోదవుతాయని, ఈ పరిస్థితుల్లో రైతాంగం ప్రకృతి సవాళ్లకు అనుగుణంగా అప్రమత్తం కావాలని అన్నారు.



## ప్రతీ గ్రామంలో పరిశుభ్రత మూల్యాంకనం నిర్వహించాలి

- ఎస్‌జే-స్కోర్ ద్వారా గ్రామాల పరిశుభ్రతకు 100 మార్కుల మూల్యాంకన విధానం
- ఘన వ్యర్థాల నిర్వహణ నిబంధనలు-2026ను కచ్చితంగా అమలు చేయాలి
- కలెక్టర్ సందీప్ కుమార్ ఝా



**జనగామ, మన చౌరాస్తా :** జిల్లాలోని అన్ని గ్రామ పంచాయతీల్లో పరిశుభ్రత, ఘన వ్యర్థాల నిర్వహణ, తాగునీటి భద్రత, దోమల నివారణ, ఓడీఎఫ్ స్థిరత్వం, ప్రజా ఆరోగ్య ప్రమాణాలను మరింత మెరుగుపరిచేందుకు "ఎస్‌జే స్కోర్ (SJ SCORE - స్వచ్ఛ జనగామ పారిశుద్ధ్యం టాస్క్ ఫోర్స్)" పేరిట నెలవారీ సమగ్ర మూల్యాంకన విధానాన్ని కచ్చితంగా అమలు చేయాలని జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా అన్నారు. సోమవారం జిల్లా సమీకృత కలెక్టర్ కార్యాలయంలోని మెయిన్ కాన్ఫరెన్స్ హాల్లో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) బెన్షాలోంతో కలిసి జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా (SJSCORE) స్వచ్ఛ జనగామ పారిశుద్ధ్య నిర్వహణపై మండలాల ప్రత్యేక అధికారులు, ఎంపీడీవోలు, ఎంపీవోలు, పంచాయతీ కార్యదర్శులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రతి గ్రామ పంచాయతీలో ప్రతి నెల ఆకస్మిక తనిఖీలు నిర్వహించి, ఆధారాలతో కూడిన 100 మార్కుల విధానంలో మూల్యాంకనం చేపట్టడం జరుగుతుందని తెలిపారు. ఈ విధానం పూర్తిగా ఘన వ్యర్థాల నిర్వహణ నిబంధనలు-2026, తెలంగాణ పంచాయతీరాజ్ చట్టం-2018లోని సెక్షన్-43 నిబంధనలకు అనుగుణంగా ఉంటుందని పేర్కొన్నారు. గ్రామాల్లో ప్రతి ఇంటి నుంచి తడి, పొడి, శానిటరీ, ప్రత్యేక సంరక్షణ వ్యర్థాలను నాలుగు వర్గాలుగా వేరు చేసి సేకరించే విధానాన్ని తప్పనిసరిగా అమలు చేయాలని సూచించారు. బహిరంగ ప్రదేశాల్లో చెత్త వేయడం, చెత్తను కాల్చడం (లేదా) పూడ్చి పెట్టడం నిషేధిత చర్యలని, అలాంటి ఘటనలు గుర్తిస్తే సంబంధిత నిబంధనల ప్రకారం చర్యలు తప్పవన్నారు. గ్రామాల్లో మురుగు కాలువలు ఎప్పటికప్పుడు స్వేచ్ఛగా ప్రవహించేలా ఉండాలని, నిల్వ నీరు లేకుండా చర్యలు తీసుకోవాలని, ప్రతి రోజు తాగునీటికి క్లోరినేషన్ చేపట్టి, రికార్డులు సక్రమంగా నిర్వహించాలని తెలిపారు. ఓవర్ హెడ్ ట్యాంకుల పరిశుభ్రత, పాఠశాలలు, అంగన్‌వాడీలు, ప్రజా మరుగుదొడ్లు, మార్కెట్లు, కాలనీల పరిశుభ్రతపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. గ్రామాల్లో దోమల నివారణ చర్యలు, లార్వా తనిఖీలు, ఫాగింగ్, డ్రై డే కార్యక్రమాలు నిరంతరం నిర్వహించాలని సూచించారు. గత నెలలో గుర్తించిన లోపాలను తదుపరి తనిఖీ నాటికి తప్పనిసరిగా సరిదిద్దాలని, అదే మూల్యాంకనంలో కీలక అంశంగా పరిగణిస్తామని వివరించారు. గ్రామ పంచాయతీల పని తీరును ఘన వ్యర్థాల నిర్వహణ, డ్రైనేజీ, రహదారులు, తాగునీటి భద్రత, ఓడీఎఫ్ స్థిరత్వం, ప్రజా ఆరోగ్యం, పాలననిధుల వినియోగం వంటి ఏడు ప్రధాన అంశాలపై 100 మార్కులతో అంచనా వేస్తామని తెలిపారు. గ్రామ పంచాయతీ కార్యదర్శులు ప్రతిరోజూ ఉదయం పరిశుభ్రత పర్యవేక్షణ చేయాలని, వారాంత పరిశుభ్రత ప్రణాళికను అమలు చేయాలని, వ్యర్థాల నిర్వహణ వ్యవస్థను పర్యవేక్షించాలని, పారిశుద్ధ్య కార్మికులకు అవసరమైన రక్షణ పరికరాలు అందించాలని ఆదేశించారు. పారిశుద్ధ్య కార్మికుల వేతనాలు ఆలస్యం కాకుండా చెల్లించాలని సూచించారు. గ్రేడ్‌ఏ సాధించిన గ్రామ పంచాయతీలకు ప్రత్యేక ప్రశంసా పత్రాలు, స్వచ్ఛ గ్రామ పంచాయతీ పురస్కారాలు అందజేస్తామని, వరుసగా తక్కువ గ్రేడ్‌లు పొందిన గ్రామ పంచాయతీలపై నిబంధనల ప్రకారం చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ఈ సమీక్ష సమావేశంలో జనగామ, ఘనపూర్ (స్టేషన్) ఆర్డీఓలు గోపీరామ్, కిరణ్ ప్రకాష్, డీఆర్డీఓ భాస్కర్, పీడీ ఈజేఎస్ సూరి, డీపీఓ వెంకట్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.





## 26న కొమురవెల్లి రైల్వే స్టేషన్ ప్రారంభం

- ముఖ్య అతిథిగా కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి రాక

**జనగామ, మన చౌరాస్తా :** ప్రముఖ పుణ్య క్షేత్రమైన కొమురవెల్లిలో నూతనంగా నిర్మించిన రైల్వే స్టేషన్ను ఈ 26న ప్రారంభించనున్నట్లు బీజేపీ జిల్లా అధ్యక్షుడు సౌడ రమేశ్ తెలపారు. ఈ ప్రారంభ కార్యక్రమానికి కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరుకానున్నట్టు వెల్లించారు. సోమవారం జనగామ జిల్లా పార్టీ కార్యక్రమంలో ఏర్పాటు చేసిన సమావేశం ఆయన మాట్లాడుతూ దేవస్థానానికి ప్రతి ఏటా వచ్చే 25 లక్షల భక్తుల కు కోసం కేంద్రం ఈ రైల్వే స్టేషన్ ఏర్పాటు చేసిందన్నారు. దేశ ప్రధాని నరేంద్ర మోడీ దేవస్థానానికి వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా రైల్వే స్టేషన్ ని అతి త్వరగా నిర్మింపజేశారని తెలిపారు. రాబోయే కాలంలో ఇంకా అధిక భక్తులు ఈ రైల్వే స్టేషన్ ద్వారా మరిన్ని సేవలు అందుతాయన్నారు. ఈ నెల 26న నిర్వహించే ప్రారంభోత్సవానికి ప్రజలు తరలి రావాలని కోరారు. కార్యక్రమంలో బజేపీ రాష్ట్ర నాయకులు ఉడుగుల రమేష్, బల్ల శ్రీనివాస్, జిల్లా ప్రధాన కార్యదర్శిలు తోకల ఉమారాణి, ఐలోని అంజిరెడ్డి, భాగాల నవీన్ రెడ్డి, పెద్దోజు జగదీష్, సంపత్, మహిపాల్, అనిల్, సందీప్ పాల్గొన్నారు.



## ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల నమోదు పెంచాలి

- కలెక్టర్ సందీప్ కుమార్ ఝా

**కొడకండ్ల, మన చౌరాస్తా :** ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల నమోదు పెంచేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని కలెక్టర్ సందీప్ కుమార్ ఝా అన్నారు. సోమవారం జిల్లాలోని కొడకండ్ల మండలంలోని మొండ్రాయి మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను కలెక్టర్ ఆకస్మికంగా సందర్శించి, పాఠశాల నిర్వహణ, విద్యార్థుల హాజరు, మధ్యాహ్న భోజనం, పారిశుద్ధ్యం, తదితర అంశాలను క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఐదో తరగతి విద్యార్థుల తరగతి గదిని సందర్శించిన కలెక్టర్ మొత్తం నమోదు అయిన విద్యార్థుల సంఖ్య, ఈ రోజు హాజరైన విద్యార్థుల సంఖ్య గురించి ఉపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్‌తో మాట్లాడిన కలెక్టర్ ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల నమోదును మరింత పెంచేందుకు ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు.

**ఎరువులు ఎమ్మార్పీ ధరకే అమ్మాలి**

నకిలీ ఎరువులను కాకుండా , నాణ్యమైన ఉత్పత్తులను మాత్రమే విక్రయించాలని జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా అన్నారు. సోమవారం కొడకండ్ల మండలం గిర్నీ తండా లో గల శ్రీ అభయ్ ఫర్టిలైజర్ షాప్ ను కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ లైసెన్స్ పత్రాలను, కొనుగోలు రిజిస్టర్ పరిశీలించారు. ఈ పాస్ యంత్రంలో నమోదు అయిన కొనుగోలు వివరాలు, ప్రస్తుతం నిల్వ గల యూరియా బస్తాల సంఖ్య లో ఉన్న తేడాని కలెక్టర్ గమనించి దీనికి సంబంధించిన వివరణ ఇవ్వాలని, మండల వ్యవసాయ అధికారికి కలెక్టర్ ఆదేశించారు. మున్ముందు ఇలాంటి తేడాలు రాకుండా ఎప్పటికప్పుడు తనిఖీ లు చేస్తూ స్టాక్ వివరాలు, అమ్మకం వివరాలు సరిగ్గా ఉండేలా పర్యవేక్షణ చేయాలన్నారు.

## ఆ హెల్త్ టెస్టులను రద్దు చేయాలి

### భవన నిర్మాణ కార్మిక జిల్లా అధ్యక్షుడు జోగు ప్రకాష్

**జనగామ, మన చౌరాస్తా :** భవన నిర్మాణ సీఎస్ సంస్థ హెల్త్ టెస్టులను రద్దు చేయాలని వెల్ఫేర్ బోర్డు స్కీం లను ప్రైవేటు ఇన్సూరెన్స్ కంపెనీలకు ఇవ్వాలనే జీవో నెంబర్ 12న సవరించి కార్మికులకు వెల్ఫేర్ బోర్డు నుండే సంక్షేమ పథకాలు అందించాలని కోరుతూ జనగామ జిల్లా కలెక్టర్ కార్యాలయం ముందు సోమవారం ధర్నా నిర్వహించారు. అనంతరం ఏఎల్ఓ కుమారస్వామికి వివిధ డిమాండ్లతో కూడిన వినతి పత్రం అందజేశారు. అనంతరం జరిగిన కార్యక్రమానికి పవన నిర్మాణ జిల్లా కోశాధికారి గంగరబోయిన మల్లేష్ రాజ్ అధ్యక్ష వహించగా భవననిర్మాణ జిల్లా అధ్యక్షులు జోగు ప్రకాష్ ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. తెలంగాణ భవన మరియు ఇతర నిర్మాణ కార్మిక సంక్షేమ బోర్డు అమలు చేస్తున్న ప్రమాద భీమా మరణానికి 10 లక్షలు సహజమానానికి రెండు లక్షల పెంచుతూ శాశ్వత పక్షిక అంగవైకల్యం ఈ నాలుగు స్కీములను ప్రైవేటు ఇన్సూరెన్స్ కంపెనీల ద్వారా అమలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం జీవో నెంబర్ 12 ను జూలై తేదీ 22. 7. 2025 నా విడుదల చేసింది. ఈ జీవోను విడుదల చేసిన రెండు రోజులకే ప్రైవేటు బీమా కంపెనీలైన క్రెడిట్ యాక్సిస్ లైఫ్ ఇన్సూరెన్స్ కంపెనీకి 250 కోట్లు ఏర్గో జనరల్ ఇన్సూరెన్స్ కంపెనీకి 94 కోట్లు ట్రయల్ బేజర్ అనే బ్రోకర్స్ సంస్థ ద్వారా 346 కోట్లు ప్రైవేటు బీమా కంపెనీలకు అక్రమంగా బదిలీ చేశారు. 1996 భవన నిర్మాణ కార్మికులు కేంద్ర చట్టం నిబంధనలకు విరుద్ధంగా ఇవ్వడం దుర్మార్గం కార్మికులకు అవసరంలేని సిఎస్ సంస్థ హెల్త్ టెస్టులు చేస్తూ బోర్డు నిధులను దుబాకా చేస్తున్నారు. తక్షణమే సిఎస్ హెల్త్ టెస్టులను రద్దుచేసి కార్మికులకు హెల్త్ కార్డులు ఇవ్వాలని అన్నారు. 1996 భవన నిర్మాణ కార్మికుల కేంద్ర చట్టం ప్రకారం వెల్ఫేర్ బోర్డు అడ్వైజరి కమిటీని నియమించి వారి నిర్ణయం ప్రకారమే బోర్డు నిధులు ఖర్చు చేయాలని కోరారు. లేకపోతే కార్మికులందరిని ఏకం చేసి పెద్ద ఎత్తున పోరాటాల నిర్వహిస్తామని వారు ప్రభుత్వాన్ని హెచ్చరించారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కోశాధికారి అన్నెబోయిన రాజు, పుతుకునూరి ఉపేందర్, కమిటీ సభ్యులు బచ్చాల చంద్రయ్య, కందుల గోపి, కానురాజు, కిష్టయ్య, రామగల నరసయ్య, చిలుక కిష్టయ్య, గంధమాల కృష్ణయ్య, యాదగిరి, భిక్షపతి, నరసింహులు, రమేశ్, యాకయ్య, మల్లయ్య, సమ్మయ్య పాల్గొన్నారు.







# మన సాంప్రదాయాలు మనకు శ్రీరామ రక్ష

## శ్రీశ్రీశ్రీ చిన్న జీయర్ స్వామి

**జనగామ, మన చౌరాస్తా :** మన సాంప్రదాయాలు పాటించడం మనకు శ్రీరామ రక్ష అని శ్రీ శ్రీ శ్రీ త్రిదండి చిన్న జీయర్ స్వామి అన్నారు. జనగామ బాణాపురం వెంకటేశ్వర స్వామి సన్నిధిలో శ్రీశ్రీశ్రీ చిన్న జీయర్ స్వామి వారి ప్రత్యక్ష పర్యవేక్షణలో సంపత్కుమార కృష్ణమాచార్య సిద్ధాంతి ఆధ్వర్యంలో అత్యంత వైభవముగా భక్తి ప్రపత్తులతో నిర్వహిస్తున్న తృతీయ పుష్కర మహోత్సవములు, మహా సుదర్శన యాగ ప్రయుక్తముగా జరుగుతున్న వేడుకలలో భాగంగా 20వ తేదీ ఉదయము వెంకటేశ్వర స్వామికి విశేష సహస్ర నామార్చన సిద్ధాంతి నిర్వహించారు. అనంతరము చిన్న జీయర్ స్వామి వారి ఆరాధ్య దైవము కోదండరాముడికి జీయర్ స్వామి వారి విశేష ఆరాధనని నిర్వహించి వారి చేతుల మీదుగా భక్తులందరికీ తీర్థ వితరణ చేశారు. అనంతరము యాగశాలలో పంచకుండాత్మకముగా ఐదు కుండములలో సుదర్శన హవనాన్ని నిర్వహించారు



60 సంవత్సరములు పైబడిన వారందరికీ ఉగ్రరథ భీమరథ ఐంద్రీ సహస్ర చంద్ర దర్శన విశేష హవనములు శేష ఆరాధనలు జరిపించారు. ఈ రోజు పూజలో పాల్గొన్న వంద మంది దంపతుల చేత దంపతీ పూజలు జరిపించారు. ఈ సందర్భంగా జీయర్ స్వామి మాట్లాడుతూ భక్తి యొక్క వైశిష్ట్యాన్ని తెలిపారు. నక్షత్రాలు , తిథులు, వారాలు, కాలం మనకు అనుకూలంగా ఉండేందుకు మన పూర్వీకులు అందించిన సాంప్రదాయాలు పాటించాలని సూచించారు. మన సాంప్రదాయాలె మనకు శ్రీరామ రక్ష అని అన్నారు. భక్తులంతా అధిక సంఖ్యలో పాల్గొని ఉత్సవాలను బాగా జరుపుకుందాం అని సోమవారం అందరికీ మంగళ శాసనం చేశారు. పుర ప్రముఖులు, ఇతర ప్రాంతాల నుండి వచ్చిన భక్తులు, వేదపండితులు పాల్గొని నిర్వహించిన ఈ రోజు కార్యక్రమంలో వృద్ధ దంపతులు అనేక మంది తమ సంతృప్తిని వ్యక్తం చేశారు. కుటుంబ వ్యవస్థలో పెద్దలను గౌరవించే ప్రక్రియ యువతరానికి అందించడం ఆనందదాయకమని పలువురు అభిప్రాయాలు వెలిబుచ్చారు. ఈ రోజు కూడా పూజలో పాల్గొన్న వారి తో పాటు వేడుకలో పాల్గొన్న వందలాదిమంది భక్తులకు అన్న ప్రసాద వితరణ చేశారు.

# కేయూ అభివృద్ధికి కేంద్రం సహకరించాలి

## పార్లమెంట్‌లో వరంగల్ ఎంపీ కడియం కావ్య

**జనగామ, మన చౌరాస్తా :** కాకతీయ విశ్వవిద్యాలయానికి కేంద్రం నుంచి అందుతున్న ఆర్థిక, విద్యా, పరిశోధనా నిధుల వివరాలపై పార్లమెంట్ ప్రశ్నించిన వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య.. కాకతీయ విశ్వవిద్యాలయం, దాని అనుబంధ కళాశాలలకు గత మూడేళ్లలో కేంద్రం అందించిన ఆర్థిక, విద్యా, పరిశోధన సహాయంపై వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కడియం కావ్య వివరాలు కోరారు. అలాగే పరిశోధన, మౌలిక వసతులు, అధ్యాపకుల అభివృద్ధి కోసం మంజూరైన, విడుదలైన, వినియోగించిన నిధుల వివరాలను వెల్లడించాలని కేంద్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించారు..ఈమేరకు వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య అడిగిన ప్రశ్నకు సమాధానంగా కాకతీయ యూనివర్సిటీకి రూసా 2.0 పథకం కింద రూ.50 కోట్ల నిధులను ఆమోదించినట్లు కేంద్ర విద్యాశాఖ సహాయ మంత్రి డా. సుకాంత మజుందార్ తెలిపారు.. 'రిసెర్చ్ ఇన్నోవేషన్ అండ్ క్వాలిటీ ఇంప్రూవ్‌మెంట్' విభాగంలో ఈ నిధులు మంజూరయ్యాయని, పరిశోధనా కేంద్రాలు, ఇన్నోవేషన్ హబ్‌లు, ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్, ఉపాధి కల్పనకు సంబంధించిన మౌలిక వసతుల అభివృద్ధికి వీటిని వినియోగించనున్నట్లు కేంద్రం వెల్లడించింది. తెలంగాణ ప్రభుత్వం సమర్పించిన తాజా నివేదిక ప్రకారం



ఇప్పటికే రూ.28.56 కోట్లు విడుదలైనట్లు తెలిపింది.. ఈ సందర్భంగా వరంగల్ ఎంపీ డా. కడియం కావ్య మాట్లాడుతూ కాకతీయ యూనివర్సిటీ తెలంగాణలో కీలక విద్యా సంస్థ అని, విద్యార్థులకు మెరుగైన అవకాశాలు కల్పించాలంటే కేంద్ర ప్రభుత్వం మరింత సహకారం అందించాలని అన్నారు. నిధుల విడుదలతోనే బాధ్యత ముగిసిపోదని, వాటిని సకాలంలో పూర్తిగా వినియోగించి పరిశోధన, మౌలిక వసతులు, అధ్యాపకుల సామర్థ్యాల పెంపుకు ఉపయోగించాల్సిన అవసరం ఉందన్నారు. కాకతీయ యూనివర్సిటీకి మరింత కేంద్ర సహకారం అందేలా తన ప్రయత్నాలు కొనసాగిస్తానని వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య స్పష్టం చేశారు.




# విద్యార్థుల జీవితాలతో ఆడుకుంటున్న బీజేపీ

## ఆర్టీఏ మెంబర్ చిలువేరు అభి గౌడ్

**జనగామ, మన చౌరాస్తా :** పన్నెండేళ్లుగా కేంద్రంలో అధికారంలో ఉన్న ప్రభుత్వం విద్య వ్యవస్థ ను నిర్వీర్యం చేస్తుందని విద్యావ్యవస్థ లో జరుగుతున్న అక్రమాలను ప్రజలకు తెలియచేయడానికి కాంగ్రెస్ పార్టీ 'చాత్రో కి గూంజ్' కార్యక్రమాన్ని నిర్వహిస్తుందని అభి గౌడ్ తెలిపారు.ఈ కార్యక్రమంలో విద్యార్థులంతా భాగస్వామ్యులు అవుతున్నందుకు కృతజ్ఞతులు తెలుపుతూ పేపర్ లీకేజీ లకు బాధ్యత వహిస్తూ కేంద్ర విద్య శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రదాన్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ దేశంలో నీట్, ఐఐటీ, యూపీఎస్సీ ఎంట్రన్స్ పరీక్షల ద్వారా కేంద్రానికి సుమారు లక్ష 30 వేల కోట్ల రూపాయలు సమకూరుతున్నాయని NSUI జాతీయ అధ్యక్షులు, వినోద్ జాఖర్ అన్నారు. ఈ మొత్తం 5 శాఖలకు చెందిన బడ్జెట్ తో సమానం అన్నారు.. అయినప్పటికీ పేపర్ లీకేజీ లు, పరీక్షలు రద్దు అవ్వడం ద్వారా పేద ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని ఆయన అన్నారు. కేంద్ర ప్రభుత్వం విద్యావ్యవస్థలో చేస్తున్న దోపిడీని విద్యార్థులకు చేరవేసే విధంగా కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో 'చాత్రో కి గూంజ్' కార్యక్రమం చేపడుతున్నామని తెలిపారు.





## బీఆర్ఎస్ తప్పుడు ప్రచారాలను

# తిప్పికొట్టాలి


## స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి

**స్టేషన్‌ఘన్‌పూర్, మన చౌరాస్తా :** దేశవ్యాప్తంగా ఎల్ నీనో ప్రభావంతో వర్షాభావ పరిస్థితులు నెలకొన్నాయని, ఈ వాస్తవాన్ని గ్రహించి రైతులు ఆరుతడి పంటలు వేసుకోవాలని స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే, మాజీ ఉప ముఖ్యమంత్రి కడియం శ్రీహరి సూచించారు. స్టేషన్ ఘనపూర్ పట్టణ కేంద్రంలోని ఎమ్మెల్యే కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. దేశంలో ఏ నదిలోనూ ఆశించిన స్థాయిలో నీటి ప్రవాహం లేదని, తెలంగాణలో మాత్రం కాంగ్రెస్ ప్రభుత్వం వల్లే కరువు వచ్చిందంటూ హరీష్ రావు మాట్లాడటం బాధ్యతారాహిత్యమని మండిపడ్డారు. ప్రస్తుతం గోదావరిలో కేవలం 16 వేల క్యూసెక్కుల ప్రవాహం మాత్రమే ఉందని, ఈ పరిస్థితుల్లో నీటిని ఎత్తిపోయడం సాధ్యం కాదని స్పష్టం చేశారు. నీటిని ఎత్తిపోయాలంటే కనీసం 2 లక్షల క్యూసెక్కుల ప్రవాహం ఉండాలని నిపుణులు చెబుతున్నారని పేర్కొన్నారు. ఒకవేళ కన్నెపల్లి నుండి నీటిని లిఫ్ట్ చేసినా, అన్నారం, సుందిళ్లలలో నీటిని నిల్వ చేయవద్దని నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ (ఎన్‌డీఎస్ఏ) స్పష్టమైన ఆదేశాలు ఇచ్చిందని, ప్రభుత్వం ఆ సూచనలనే పాటిస్తుందని తెలిపారు. నీటిని లిఫ్ట్ చేస్తే ఏం జరిగినా బాధ్యత తాము తీసుకుంటామని చెప్తున్న బిఆర్ఎస్ నాయకులు, తమ హయాంలో లక్ష కోట్లతో కట్టిన కాళేశ్వరం కుంగిపోవడానికి ఎవరు బాధ్యత వహిస్తారని కడియం శ్రీహరి ప్రశ్నించారు. జరిగిన దానికి బాధ్యత తీసుకోకుండా జరగబోయే దానికి బాధ్యత వహిస్తామనడం సిగ్గుచేటన్నారు. కాళేశ్వరం కుంగిపోవడానికి బాధ్యత తమదేనని కేసీఆర్, హరీష్ రావు ముందుగా ఒప్పుకోవాలని డిమాండ్ చేశారు. పదేళ్ల అధికారంలో ఉండి నిరుద్యోగులను మోసం చేసిన బిఆర్ఎస్ నాయకులు ఏ ముఖం పెట్టుకుని పాదయాత్రలు చేస్తారని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే 70 వేల ఉద్యోగాల నియామక ప్రక్రియను పూర్తి చేసిందని, నోటిఫికేషన్లు ఇచ్చి వదిలేసిన వారు, గ్రూప్ 1 పేపర్ లీకేజీలకు కారణమైన వారే ఇప్పుడు యువతను రెచ్చగొడుతున్నారని ఆరోపించారు. గడిచిన పదేళ్లలో కల్వకుంట్ల కుటుంబం తెలంగాణ వనరులను దోచుకుందని, 2014కు ముందు, ఇప్పటికి వారి ఆస్తుల తేడాను గమనించాలని కడియం శ్రీహరి కోరారు. బిఆర్ఎస్ పార్టీ ఖాతాలో ఉన్న 1400 కోట్ల ఫండ్ క్విడ్ ప్రోకో ద్వారా వచ్చిందేనని, దానిని ఉద్యమకారులకు పంచాలని స్వయంగా కవిత డిమాండ్ చేస్తున్న విషయాన్ని గుర్తు చేశారు. హరీష్‌రావు నీటి పారుదల శాఖ మంత్రిగా అవినీతికి పాల్పడ్డారని కవిత అంటున్నారని, చాతనైతే బిఆర్ఎస్ నాయకులు ముందుగా ఆమెకు సమాధానం చెప్పాలని సవాల్ విసిరారు. అధికారం కోల్పోయామనే అక్కసుతో సభ్యత, సంస్కారం మరిచి, కొన్ని పత్రికలు, యూట్యూబ్ ఛానళ్ల ద్వారా ప్రభుత్వంపై విషప్రచారం చేస్తున్నారని ధ్వజమెత్తారు. నియోజకవర్గంలోని అన్ని రిజర్వాయర్లను దేవాదుల ద్వారా నింపి, వారం రోజుల్లో రైతులకు సాగునీరు అందించేందుకు కృషి చేస్తున్నానని, ప్రజలు బిఆర్ఎస్ మాయమాటలు నమ్మి మోసపోవద్దని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో మున్సిపల్ చైర్మన్ తాటికొండ వినయ్ కుమార్, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు అంబాటి కిషన్ రాజ్, వైస్ చైర్మన్ నీల రాజమ్మ, కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు, బూత్ లెవెల్ ఏజెంట్లు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



## శ్రీ వెంకటేశ్వ కళాపరిషత్ అడ్ హక్ కమిటీ ఏర్పాటు

**జనగామ, మన చౌరాస్తా :** జనగామ జిల్లా రంగస్థలం కళాకారుల సర్వసభ్య సమావేశం స్థానిక గౌతమ్ మోడల్ స్కూల్లో తొలి సమావేశం నిర్వహించారు. సమావేశానికి శ్రీవీరాంజనేయ నాట్యమండలి జనగామ వ్యవస్థాపకులు మేళ్లచెరువు వేంకట అప్పయ్య శాస్త్రి, కొండ ఫౌండేషన్ లద్దునూరు వ్యవస్థాపకులు కొండ శ్రీనివాస్, స్టేషన్ ఘనపూర్ నుండి సింధూరి కొండలరావు (సురభి), నంచర్ల వైకుంఠం, ఈరవెన్ను నాటకరంగస్థల కళాకారులతో పాటుగా జనగామ పట్టణ ఔత్సాహిక కళాకారులు హాజరై ఏకగ్రీవంగా శ్రీ వెంకటేశ్వర కళాపరిషత్ జనగామ అనే సాంస్కృత సంస్థను, అడ్ హక్ కమిటీని ఏర్పాటు చేసుకున్నారు. గౌరవ అధ్యక్షుడిగా మోతే సురేందర్ రెడ్డి, అధ్యక్షుడిగా మేళ్లచెరువు వెంకట్ , ముఖ్య సలహాదారులుగా అప్పయ్య శాస్త్రి, నంచర్ల వైకుంఠం, ఉపాధ్యక్షులుగా మేకల రమణారెడ్డి, పన్నీరు రాజు, ప్రధాన కార్యదర్శిగా గంగు నాగరాజు శర్మ, సహాయ కార్యదర్శిగా గంగు ఆంజనేయ శర్మ, కోశాధికారిగా చల్లా రాజ నరసింహారెడ్డి, ప్రచార కార్యదర్శిగా కొండ శ్రీనివాస్, సంగీత దర్శకులుగా సింధూరి కొండలరావు, కార్యవర్గ సభ్యులుగా గంగు సాంబమూర్తి, నామాల సిద్ధులు, నల్ల నర్సిరెడ్డి, కూస భాస్కర్ రెడ్డి, ఎక్కల దేవి వెంకటేశ్వర్లు, పానుగంటి రామమూర్తి నియమితులయ్యారు.



# జనగామ పుర వీధుల్లో జగన్నాథుడు..

- వైభవంగా జగన్నాథ రథయాత్ర
- ప్రారంభించిన డీసీపీ రాజమహేంద్ర నాయక్

**జనగామ, మన చౌరాస్తా :** హరే కృష్ణ హరే రామ భక్తబృందం, గీతాశ్రమం ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన శ్రీ జగన్నాథ స్వామి రథయాత్ర జనగామ పట్టణంలో భక్తిశ్రద్ధల మధ్య వైభవంగా సాగింది. సాయంత్రం 5 గంటలకు బస్టాండ్ చౌరస్తా నుంచి ప్రారంభమైన రథయాత్ర వాసు గణపతి దేవాలయం ముందు నుంచి జనగామ రైల్వే స్టేషన్ వరకు రథయాత్ర సాగింది. రథయాత్రను జనగామ జిల్లా డీసీపీ రాజమహేంద్ర నాయక్ శ్రీ జగన్నాథ స్వామి రథం తాడును లాగి ప్రారంభించారు. పట్టణ ప్రధాన వీధుల గుండా సాగిన యాత్రలో భక్తులు హరినామ సంకీర్తనలతో పాల్గొని ఆధ్యాత్మిక వాతావరణాన్ని నెలకొల్పారు. రథయాత్రకు అడుగడుగునా ప్రజలు హారతులు ఇచ్చి స్వాగతం పలికారు.రథయాత్ర అనంతరం జనగామ రైల్వే స్టేషన్ వద్ద భక్తులకు మహాప్రసాదంతో పాటు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. వందలాది మంది భక్తులు ప్రసాదాన్ని స్వీకరించారు.ఈ కార్యక్రమంలో ధనుంజయ్ పండిత్ దాస్, మాధవ్ గోవింద దాస్ ప్రభు, శ్రీ సనాతన దాసు,



పద్మావతి దేవి దాసి, కృష్ణ భావ దేవి దాసి, బాలమణి,వైరు వెంకన్న, నాగేందర్, ధర్మపురి శ్రీను, అరుణ్, పరశురాములు, విజయ్, సిద్ధులు, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.




# రాకా మూవీలో సిరి హన్మంతు

టాలీవుడ్ ఐకాన్ స్టార్ అల్లు అర్జున్, కోలీవుడ్ స్టార్ డైరెక్టర్ అట్లీ కాంబోలో 'రాకా' సినిమా వస్తుందని తెలిసిందే. సైన్స్ ఫిక్షన్, యాక్షన్ ఎలిమెంట్స్‌తో వస్తోన్న ఈ చిత్రంలో బాలీవుడ్ స్టార్ హీరోయిన్ దీపికా పదుకొణె హీరోయిన్‌గా నటిస్తోంది. ఈ ప్రాజెక్టులో ఇప్పటికే మలయాళ నటి ఫెమినా జార్జ్, పంజాబీ నటి నైలా గ్రేవల్ భాగమైనట్లు క్రేజీ అప్‌డేట్స్ వచ్చాయని తెలిసిందే. తాజాగా మరో ఆసక్తికర నెట్టింట వైరల్ అవుతోంది. తెలుగు నటి సిరి హన్మంతు 'రాకా' చిత్రంలో జాయిన్ అయింది. రీసెంట్‌గా జరిగిన ఓ ఈవెంట్‌లో నిర్మాత ఎస్‌కేఎన్ ఈ విషయాన్ని అధికారికంగా వెల్లడించారు. సిరి హన్మంతు చివరగా సీతాపయనంలో మెరవగా.. త్వరలో విడుదల కానున్న ' చెన్నై లవ్ స్టోరీ' లో కూడా సందడి చేయనుంది. ఈ నేపథ్యంలో ఇంతకీ సిరి హన్మంతు రాకా మూవీలో ఎలాంటి పాత్రలో కనిపించబోతున్నది ఆసక్తికరంగా మారింది. ప్రస్తుతం ముంబైలో షూటింగ్ కొనసాగుతోంది. యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా వస్తోన్న ఈ చిత్రాన్ని సన్ పిక్చర్స్ తెరకెక్కిస్తోంది. ఈ మూవీని 2027 చివరలో విడుదల చేయనున్నారు. ఈ చిత్రానికి సాయి అభ్యాంకర్ మ్యూజిక్ డైరెక్టర్‌గా పనిచేస్తున్నాడు.




Printed, Published by **UPPALANCHI POORNIMA**, On behalf of UPPALANCHI POORNIMA, Printed at HAMARA WARANGAL Printers &Graphics, # 25-8-182, Babujinagar, Kazipet, Warangal - 506003 and Published from # 4-8-65, Dharmakancha, Jangon, Warangal-506167, Editor : **UPPALANCHI NARENDER**, email : manachourasta@gmail.com, Ph : **8555800812**, PRGI No. TGTEL/25/A4350